RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 171 | శనివారం ,11, జనవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-



## కలెక్టర్లూ.. మారండి!

- ➤➤ కొందరు క్షేత్ర స్థాయికి వెళ్లడంలేదు..
- ➤➤ ఆఫీసుల్లోనే కూర్చుని పని చేయాలనుకుంటున్నారు
- ➤➤ ఇష్టం లేకుంటే చెప్పండి.. వేరేచోటకు పోస్టింగ్
- ➤➤ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- ➤➤ ఈ నెల 26 నుంచి 4 ప్రతిష్మాత్మక పథకాలు
- ➤➤ 24 లోగా గ్రామ సభలను నిర్వహించాలి
- ➤➤ అర్హులందరికీ 'రైతు భరోసా' సొమ్ము ఇవ్వండి
- ➤➤ భూమిలేని కూలీలకు 'ఆత్మీయ భరోసా'
- ➤➤ గతంలోని అర్హతలతోనే కొత్త రేషన్ కార్డులు
- ➤➤ ముందుగా అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- ➤➤ కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- ➤➤ 26 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడి

## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

-18న పునఃప్రారంభం



హైదరాబాద్ : తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఇవాళ ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు.రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు. 17న పునఃప్రారంభం కానున్నాయి. సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా తరగతులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఓటర్ల జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర



- ◆ ఈసీకి కేజ్రీవాల్ ఫిర్యాదు!
- ◆ కేజ్రీవాల్ ఫిర్యాదుపై దర్యాప్తునకు ఆదేశించిన ఈసీ
- ◆ దిల్లీలో రసవత్తరంగా ఎన్నికల ఫైట్?!
- ◆ వలస జీవులను నకిలీ ఓటర్లని అంటారా!
- ◆ జాట్ల రిజర్వేషన్లపై మాటకు మాట
- ◆ ఇండియా కూటమి నేతల ద్వారా మాపై కేజ్రీవాల్ ఒత్తిడి: కాంగ్రెస్

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్న నియోజకవర్గ ఓటర్ల జాబితాను బీజేపీ తారుమారు చేసిందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గురువారం ఎలక్షన్ కమిషన్?కు ఫిర్యాదు చేశారు. బీజేపీకి అనుకూలంగా 13,000 ఓట్లను చేర్చి, మరో 5,500 ఓట్ల నమోదును రద్దు చేశారని, ఈ విధంగా ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసేందుకు కాషాయ పార్టీ కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు.



## దేశంలో పెద్దల్లో తొలిసారి హెచ్ఎంపీవీ వైరస్ నిర్ధారణ

- చైనాలో వేగంగా విస్తరిస్తోన్న కొత్తరకం వైరస్
- భారత్‌లోనూ పెద్దల్లో మొదటి కేసు నమోదు
- అహ్మదాబాద్‌లో ఆస్తమా బాధితుడికి పాజిటివ్
- 80 ఏళ్ల వ్యక్తికి పాజిటివ్
- గుజరాత్‌లో హెచ్ఎంపీవీ కేసుల సంఖ్య మూడు
- దేశంలో మొత్తం బాధితుల 9

చైనాలో వెలుగు చూసిన హ్యూమన్ మెటానిమోవైరస్ – హెచ్ఎంపీవీ వైరస్ అనుకున్న దాని కంటే వేగంగానే ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరిస్తోంది. భారత్‌లో మొదటిసారి బెంగళూరులో 3, 8 నెలల వయసు కలిగిన ఇద్దరు చిన్నారులకు ఈ హెచ్ఎంపీవీ వైరస్ పాజిటివ్‌గా తేలింది. ఆతర్వాత అహ్మదాబాద్‌లో రాజస్థాన్‌కు చెందిన 2 నెలల చిన్నారికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎటువంటి కేసు నమోదుకాకపోగా.. శుక్రవారం ఓ కేసు బయటపడింది. చైనాలో వేగంగా విస్తరిస్తోన్న హ్యూమన్ మోటాన్యుమోవైరస్ కేసులు భారత్‌లోనూ క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా గుజరాత్‌లో మరో కేసు బయటపడింది. ఇప్పటి వరకూ బాధితులంతా చిన్నారులే కాగా.. తొలిసారి ఓ వృద్ధుడికి ఈ వైరస్ సోకింది. అహ్మదాబాద్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధుడికి హెచ్ఎంపీవీ వైరస్ నిర్ధారణ అయ్యింది.

## 'నేనూ మనిషినే, దేవుడ్ని కాదు

- ◆ తప్పులు జరుగుతాయ్'
- ◆ తొలి పాడ్ కాస్ట్‌లో ప్రధాని మోదీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్
- ◆ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలి పాడ్‌కాస్ట్
- ◆ ప్రధానిని ఇంటర్వ్యూ చేసిన జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్
- ◆ ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్న మోదీ



ప్రధాని నరేంద్ర మోదీ మొదటిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తోన్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కామత్ పలు ఆసక్తికర విషయాలను షేర్? చేసుకున్నారు. ఈ పాడ్?కాస్ట్?కు సంబంధించిన ట్రైలర్ వీడియోను నిఖిల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్? చేశారు. దీన్ని మోదీ రీపోస్ట్ చేశారు. అందులో ప్రధాని మోదీ గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో తానూ ఒక మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని మోదీ చెప్పారు.

దాదాపు రెండు నిమిషాలు ఉన్న ఈవీడియోలో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. పాడ్?కాస్ట్? ప్రారంభంలో నిఖిల్ కామత్ మాట్లాడారు. 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అని అన్నారు. దీనికి మోదీ బదులిస్తూ 'ఇదే నా ఫస్ట్? పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు మరి' అనడం వల్ల నవ్వులు పూశాయి.

కాగా, రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటీ? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగారు. దానికి మోదీ బదులిచ్చారు. "రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్ తీసుకోవడం కోసం రావాలి. కానీ సొంత లక్ష్యాలు నెరవేర్చుకోవడం కోసం కాదు" అని అన్నారు. ఈ సందర్భంగా మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాత స్పీచ్?ల గురించి మాట్లాడారు. అప్పుడు తానే ఏదో అని ఉంటానని, పొరపాట్లు జరుగుతుంటాయన్నారు. తానూ మనిషినేనని భగవంతుడిని కాదు కదా అంటూ వ్యాఖ్యానించారు.

తొలి రెండు సార్లు ప్రధానిగా తన అనుభవాలను మోదీ షేర్? చేసుకున్నారు. ఈ పాడ్?కాస్ట్? వీడియోను ప్రధాని రీపోస్ట్ చేశి. 'ఈ ఇంటర్వ్యూను మీరంతా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని క్యాప్షన్ జోడించారు. అయితే ప్రస్తుతం ఈ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ ట్రైలర్ వచ్చింది. పూర్తి విడియో ఎప్పుడొస్తుందన్న దానిపై క్లారిటీ లేదు.



## మినీ ఎయిర్‌పోర్ట్‌గా 'మల్కాజిగిరి రైల్వే స్టేషన్'

- మారిపోనున్న మల్కాజిగిరి రైల్వేస్టేషన్ రూపురేఖలు
- మల్కాజిగిరి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు ప్రారంభం
- అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఆధునికీకరణ
- త్వరలోనే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌కు అనుమతి
- 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- మూడు లిఫ్టులు, మూడు ఎస్కలేటర్లు పనులు
- స్టేషన్‌లో హై-లెవల్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు
- గ్రీనరీతో కూడిన గార్డెన్లతో పాటు 'ఐ లవ్ యూ మల్కాజిగిరి' అనే సెల్ఫీ పాయింట్
- మహబూబ్‌నగర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లకు స్టాప్
- ఈ మార్గంలో 62 రైళ్లు రాకపోకలు
- స్టేషన్‌లో 600 సాధారణ టిక్కెటుదారులు, 500 వరకు రిజర్వేషన్ ప్రయాణికులు

## ట్రంప్ నైపుణ్యం కలిగిన సంధానకర్త..

-ప్రజల దృష్టిని మరల్చేందుకే అలాంటి వ్యాఖ్యలు : ట్రూడో



అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేయాలంటూ ట్రంప్ ఇటీవలే కీలక సూచన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఇద్దరు దేశాధినేతల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. ట్రంప్ సూచనను ట్రూడో ఘాటుగా తిరస్కరించారు.

## మళ్లీ యాక్షన్‌లోకి హైడ్రా




- ◆ మణికొండ నెక్నాంపూర్‌లో ఆక్రమణల కూల్చివేతలు
- ◆ నెక్నాంపూర్ చెరువును ఆక్రమించి జరిపిన నిర్మాణాలను పడకొట్టిన హైడ్రా
- ◆ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారుల కూల్చివేతలు
- ◆ ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు



## రూ.5 లక్షల కోట్లకుపైగా ఆస్తి నష్టం

- వైల్డ్‌ఫైర్ బీభత్సం..
- కార్చిచ్చుకు తగలబడిపోతున్న అగ్రరాజ్యం అమెరికా
- సంపన్నుల నగరం లాస్ ఏంజెలెస్‌లో బీభత్సం
- మంటల్లో మాలిబు ప్రాంతంలో బైడెన్ కుమారుడి ఇళ్లు
- 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ఈ కార్చిచ్చులో 31840 ఎకరాలు పైగా బుగ్గిపాలు
- హెలికాప్టర్ల ద్వారా నీటిని చిమ్ముతున్నా అదుపులోకి రాని మంటలు
- 2005లో సంభవించిన కార్చిచ్చు తర్వాత ఇదే అతిపెద్దది
- దెబ్బతిన్న 2 వేలు వరకు నిర్మాణాలు
- 13,000 భవనాలకు పొంచి ఉన్న ముప్పు

అగ్రరాజ్యం అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కనీవినీ ఎరుగని నష్టాన్ని మిగుల్చుతోంది. ఈ మంటల్లో చిక్కుకుని ఇప్పటి వరకూ దాదాపు పది మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 2 వేలు వరకు నిర్మాణాలు దెబ్బతినగా.. మరో 13,000 భవనాలకు ముప్పు పొంచి ఉంది.

తెలంగాణ సేన

శనివారం ,11, జనవరి, 2025

# కలెక్టర్లూ.. మారండి!

జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లడంలేదని, ఆఫీసుల్లోనే కూర్చుని పని చేయాలనుకుంటున్నారని తప్పుబట్టారు. ఇది మంచి పద్ధతి కాదని, వారు మారాలని, ఇక నుంచైనా క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. ఐఏఎస్ అధికారి జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం ఓ మధురానుభూతి అని చెప్పారు. "ఒకవేళ ఎవరికైనా కలెక్టర్‌గా పనిచేయడం ఇష్టం లేకపోతే చెప్పండి.. వేరేచోట పోస్టింగ్ ఇస్తా" అని అన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో ముఖ్యమంత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రత్యేకంగా కొన్ని సూచనలు చేశారు. "గతంలో ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు ఒక జిల్లాకు వెళ్లాలన్నా, ఏదైనా తండాలు, మారుమూల ప్రాంతాలకు వెళ్లి రావాలన్నా కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.. ఏ జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లి రావాలన్నా రెండు, మూడు గంటల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నాయి. కలెక్టర్లు అందరూ జిల్లాల్లో పర్యటనలు చేయాలి. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి. మీరు మంచి పేరు తెచ్చుకుని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలి" అని సీఎం రేవంత్ అన్నారు. మహిళా ఐఏఎస‌లతోపాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టళ్లను సందర్శించాలని, అక్కడే రాత్రి బస చేసి.. విద్యార్థుల అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. వారి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని, వారి పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అవుతుందని అన్నారు. ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇటీవల కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశారంటూ అన్ని జిల్లాల కలెక్టర్లను అభినందించారు.

**26 నుంచి ఆ నాలుగు పథకాలు..**

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయినందున.. ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు అత్యంత ప్రాధాన్యం ఉందని సీఎం రేవంత్ అన్నారు. ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి నాలుగు ప్రతిష్ఠాత్మకమైన పథకాలను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కలెక్టర్లు ఈ నెల 15లోగా ఈ పథకాల అమలుకు కావాల్సిన సన్నాహకాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో అన్ని జిల్లాల్లో నోడల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 26 తర్వాత తాను జిల్లాలో పర్యటిస్తానన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయి అధికారులను కూడా అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని సీఎం పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందన్నారు. ఈ నెల 26న ప్రారంభించనున్న నాలుగు పథకాల అమలుకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు సభలను నిర్వహించాలని అన్నారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సేకరించిన వివరాలు, తయారు చేసిన జాబితాలను గ్రామ సభల్లోనే వెల్లడించాలన్నారు.

**అలాంటి పొరపాటు జరగొద్దు..**

గతంలో రైతుబంధు పేరిట భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అయిందని, గత ప్రభుత్వం వ్యవసాయ యోగ్యం కాని భూములకు పంట పెట్టుబడి సాయం అందించిందని సీఎం రేవంత్ అన్నారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని హెచ్చరించారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, అదే సమయంలో అనర్హులు ఒక్కరు కూడా లబ్ధి పొందకుండా చూడాలని అన్నారు. ప్రతి జిల్లాకు, మండలానికి ఓ నోడల్ అధికారిని నియమించాలని, అధికారుల బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి అనర్హులను గుర్తించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, వ్యవసాయానికి అక్కరకురాని భూములను గుర్తించి, వాటిని మాత్రమే ఈ పథకం నుంచి మినహాయించాలని అన్నారు.

రియల్ ఎస్టేట్ భూములు, లే-అవుట్ భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, మైనింగ్ భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సేకరించిన భూములు ఈ అనర్హత జాబితాలోకి వస్తాయని వివరించారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల రెవెన్యూ రికార్డులు, డీటీసీపీ లే-అవుట్ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా ఈ జాబితాలను తయారు చేయాలన్నారు. విలేజ్ మ్యాప్‌లతో పాటు అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి వీటిని ధ్రువీకరించుకుని, వీటిని గ్రామ సభలో ప్రచురించాలని చెప్పారు. రైతులు ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురికావొద్దని, పంట వేసినా.. వేయకున్నా.. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికీ రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు.

**20 రోజులు ఉపాధి పనులు చేస్తేనే..**

భూమి లేని నిరుపేద, ఉపాధి కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం రేవంత్ చెప్పారు. ఆ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల నగదు సాయం అందిస్తామన్నారు. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇక కొత్త రేషన్ కార్డులను.. గతంలో ఉన్న అర్హత నిబంధనల ప్రకారమే జారీ చేస్తామన్నారు. ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ కార్డులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 'వన్ రేషన్- వన్ స్టేట్' విధానాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో వెల్లడించాలన్నారు.

ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గూడు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించామన్నారు. అందులో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్లకు అరు?లైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో ఈ అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రచురించాలన్నారు. సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర

అంతేకాదు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు అక్రమ నిధులను తన ఇంట్లో దాచుకొన్న బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఇంటిపై అధికారులు దాడి చేయాలని డిమాండ్ చేశారు. కేజ్రీవాల్? ఫిర్యాదు చేసిన నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

**వలస జీవులను నకిలీ ఓటర్లని అంటారా!**

ఆప్ అధ్యక్షుడికి ఓటమి భయం పట్టుకుందని, ఆయన న్యూ దిల్లీతోపాటు, మరో స్థానం నుంచి కూడా పోటీ చేయవచ్చని బీజేపీ చేసిన వ్యాఖ్యలను కేజ్రీవాల్ కొట్టిపడేశారు. "నేను న్యూదిల్లీ నుంచి మాత్రమే బరిలోకి దిగుతా. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీల మధ్యే ముఖాముఖి పోటీ ఉంది. ఇది ఇండియా కూటమి వ్యవహారం కాదు" అని స్పష్టం చేశారు. 2013 నుంచి వరుసగా మూడుసార్లు న్యూదిల్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైన కేజ్రీవాల్‌పై పోటీగా బీజేపీ తరఫున మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎస్. వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ నుంచి మాజీ సీఎం షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ బరిలో ఉన్నారు. దీంతో ఈ స్థానంలో పోటీ ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఓటర్ల జాబితా గురించి కేజ్రీవాల్ ఆరోపణలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా ఖండించారు. యూపీ, బిహార్‌ల నుంచి దిల్లీకి వలస వచ్చిన ప్రజలను నకిలీ ఓటర్లంటూ ఆప్ అధినేత అవమానిస్తున్నారని అన్నారు.

**జాట్ల రిజర్వేషన్లపై మాటకు మాట**

బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దిల్లీలోని జాట్ సామాజికవర్గానికి రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని తుంగలో తొక్కిందని కేజ్రీవాల్ విమర్శించారు. జాట్లను సెంట్రల్ ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి గతంలో తాను లేఖ కూడా రాసినట్లు పేర్కొన్నారు. అయితే, గత 11 ఏళ్లుగా జాట్లను పట్టించుకోని కేజ్రీవాల్, ఇపుడు దిల్లీని కులం ప్రాతిపదికగా వేరు చేసే ప్రయత్నం ప్రారంభించారని మాజీ ఎంపీ, న్యూదిల్లీ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ప్రతిదాడికి దిగారు.

**ఇండియా కూటమి నేతల ద్వారా మాపై కేజ్రీవాల్ ఒత్తిడి: కాంగ్రెస్**

దిల్లీ ఎన్నికల్లో 'అధికార వ్యతిరేకత' కారణంగా ఆందోళన చెందుతున్న కేజ్రీవాల్ ఇండియా కూటమి నేతల ద్వారా తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని నగర కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ తెలిపారు. ఆప్‌నకు మద్దతుగా కూటమి పార్టీలు ఏవీ ఇప్పటి దాకా అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదని, పొత్తుకు తాము కూడా సిద్ధంగా లేమని ఆయన స్పష్టం చేశారు.

# ట్రంప్ నైపుణ్యం కలిగిన సంధానకర్త..

యూఎస్‌లో కెనడా విలీనమయ్యే అవకాశమే లేదని ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మరోసారి అదే విషయంపై ట్రూడో స్పష్టతనిచ్చారు. సుంకాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ట్రంప్ విలీనం వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

ఈ మేరకు ట్రంప్‌పై ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ చాలా నైపుణ్యం కలిగిన సంధానకర్త అంటూ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రజలు చమురు, సహజ వాయువు, విద్యుత్, స్టీల్, అల్యూమినియం, కలప, కాంక్రీట్ వంటివన్నీ కెనడా నుంచే కొనుగోలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. తమ దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తానని ఆయన అంటున్నారు. అలా చేసే ముందు ప్రజల దృష్టిని మరల్చేందుకే విలీనం వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. అమెరికాలో కెనడా విలీనం ఎప్పటికీ జరగదని తేల్చి చెప్పారు. తమ ప్రజలు కెనడియన్లుగానే ఉండేందుకు ఇష్టపడతారని స్పష్టం చేశారు. టారిఫ్‌లు విధిస్తే వాటి ధరలు అకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉందని ట్రూడో పేర్కొన్నారు.

2018 వాణిజ్య వివాదం సమయంలో అమెరికా వస్తువులను లక్ష్యంగా చేసుకొని కెనడా కౌంటర్ టారిఫ్‌లను ఉపయోగించడాన్ని ఈ సందర్భంగా ట్రూడో ప్రస్తావించారు. అయితే, ఈ సారి తాము అలా చేయకూడదని అనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఒకవేళ అలా చేస్తే కెనడియన్లకు ధరలను పెంచినట్లైతుందని.. వాణిజ్య సంబంధాలను కూడా దెబ్బతీస్తుందని ట్రూడో వివరించారు.

**వివాదం ఏంటి..?**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్.. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే కెనడా, మెక్సికో, చైనా వస్తువులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలోకి అక్రమ వలసలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ నివారణకు ఇవి సహాయపడతాయని ఆయన చెప్పారు. మెక్సికో, కెనడాల నుంచి వచ్చే ప్రతి వస్తువుపై 25 శాతం సుంకం విధించే ఉత్తర్వులపై జనవరి 20 సంతకం చేస్తానని ట్రంప్ చెప్పారు. ఫెంటానిల్ స్మగ్లింగ్‌ను చైనా అరికట్టే వరకు ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకం విధించాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఈ ప్రకటన తర్వాత ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రూడోకు ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాలను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదంటే సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని సూచించారు. ఈ క్రమంలో 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఇక ఇంతలో కెనడా పధాని ట్రూడో రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ప్రకటన తర్వాత ట్రంప్ మరోసారి కెనడాను 51వ రాష్ట్రంగా చేయాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటం కెనడాలో చాలా మంది ప్రజలకు ఇష్టమేనని వ్యాఖ్యానించారు. కెనడాకు అధికంగా రాయితీలు ఇచ్చి తమ దేశం ఎక్కువ కాలం నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం కెనడా ప్రధాని ట్రూడోకు తెలుసు కాబట్టే రాజీనామా చేశారని వ్యాఖ్యానించారు. అమెరికాలో విలీనమైతే దిగుమతి సుంకాలు ఉండవని, పన్నులు తగ్గుతాయన్నారు. అంతేకాకుండా రష్యా, చైనాలకు చెందిన నౌకల నుంచి ఎలాంటి ముప్పు ఉండదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ ప్రతిపాదనపై ట్రూడో ఘాటుగా స్పందించారు. అలా జరిగే సమస్యే లేదని తేల్చి చెప్పారు. ఇదే అంశంపై ఇప్పుడు మరోసారి క్లారిటీ ఇచ్చారు.

# మినీ ఎయిర్‌పోర్ట్‌గా 'మల్కాజిగిరి రైల్వే స్టేషన్'

దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వేల్లో మౌలికసదుపాయాలను మెరుగుపరుస్తూ.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అమృత్ భారత్ స్టేషన్ల పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగానే చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసింది. తాజాగా, సికింద్రాబాద్ స్కీమ్‌లో భాగంగా దానికి కూతవేటు దూరంలోని మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేశారు. ఆ స్టేషన్‌లో పనులు కూడా మొదలయ్యాయి.

పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేలా జంట నగరాల పరిధిలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ఇప్పటికే చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి.. ప్రారంభించారు. ప్రస్తుతం సంక్రాంతి ప్రత్యేక రైళ్లు నడిపిస్తుండగా.. మార్చి నుంచి రెగ్యులర్ రైళ్లు ఈ స్టేషన్ నుంచే బయలుదేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా, సికింద్రాబాద్‌కు సమీపంలో ఉన్న మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం (ఏబీఎస్ఎస్) కింద అభివృద్ధి చేస్తున్నారు. సకల వసతులతో దీని రూపురేఖలు మార్చేస్తున్నారు. సికింద్రాబాద్ స్కీంలో భాగంగా ఈ స్టేషన్‌ను ఎంపిక చేశారు. అభివృద్ధి పనుల చకచక జరుగుతున్నాయి.

ఇప్పటికే 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు లిఫ్టులు, మూడు ఎస్కలేటర్లు పనులు చేపట్టారు. ఇందేవ్‌ల్ కాంట్రాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. స్టేషన్‌లో హై-లెవల్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. వీఐపీ లాంజ్, ఏసీ వేయిటింగ్ హాల్, విశాలమైన పార్కింగ్ వసతి, రైల్వేస్టేషన్ రాకపోకలు సాగించేందుకు కొత్తగా అప్రోచ్‌రోడ్డు, స్టేషన్‌కు ఇరువైపులా ఆకర్షనీయంగా పోర్టికోల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి.

గ్రీనరీతో కూడిన గార్డెన్లతో పాటు 'ఐ లవ్ యూ మల్కాజిగిరి' అనే సెల్ఫీ పాయింట్‌ను సైతం స్టేషన్ ముందు నిర్మాణం జరుగుతోంది. గత అక్టోబరు మొదలైన పనులు పూర్తయిన తర్వాత మల్కాజిగిరి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ స్టేషన్ మినీ ఎయిర్‌పోర్టుగా ప్రయాణికుల మన్ననలు పొందనుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వంటి కొన్ని రైళ్లకు అక్కడ స్టాప్ ఉంది. వీటితో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం స్టాప్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ.27 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండు ఫ్లాట్‌పామ్‌ల మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీని బట్టి మరొకటి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. రోజూ ఈ మార్గంలో 62 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా... స్టేషన్‌లో 600 సాధారణ టిక్కెటుదారులు, 500 వరకు రిజర్వేషన్ ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణిస్తున్నారు.


# రూ.5 లక్షల కోట్లకుపైగా ఆస్తి నష్టం

హాలీవుడ్ సెలబ్రిటీలు సహా చాలా మంది సంపన్నుల నివాసాలు మంటలకు కాలిబూడిదవుతున్నాయి. దీంతో వారంతా తమ ప్రాణాలను కాపాడుకోడానికి కట్టుబట్టలతో ఇళ్లను వీడుతున్నారు. అమెరికాలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా కాలిఫోర్నియా రాష్ట్రంలో సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెలెస్ కాలి బూడిదైపోతోంది. ఈ ప్రాంతంలో హాలీవుడ్ స్టార్స్‌తో పాటు బిలియనీర్లు నివసిస్తుంటారు. ఈ కార్చిచ్చులో ఖరీదైన ఇళ్లు, కార్లు, ఇతర వస్తువులు మంటల్లో బూడిదవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ ఇల్లు కూడా కాలిపోయినట్లు తెలుస్తోంది. మాలిబు ప్రాంతంలో హంటర్ బైడెన్‌కు అత్యంత విలాసవంతమైన మాన్షన్ ఉంది. ఈ కార్చిచ్చులో ఆ మాన్షన్‌తో పాటు ఖరీదైన కారు కూడా కాలిపోయింది. మాన్షన్ మొత్తం కాలి బూడిదైపోయిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

లాస్ పాలిసాడ్స్ ఫైర్.. ఈటన్ ఫైర్.. సన్‌సెట్ ఫైర్.. ఇలా వేర్వేరు పేర్లతో ఆరు చోట్ల కార్చిచ్చు రగులుతూనే ఉంది. రెండ్రోజుల వ్యవధిలో వేల ఎకరాలు ఆహుతికాగా ప్రస్తుతం హాలీవుడ్ కొండలు కూడా ప్రమాదంలో పడ్డాయి. ఈ అగ్నికీలల కారణంగా ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రికి సుమారు 2వేల ఇళ్లు దగ్ధమైనట్లు వెల్లడించారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. కార్చిచ్చులో దగ్ధమైన నివాసాలు, కార్లు, ఖరీదైన వస్తువుల విలువ మొత్తం కలిపి 57 బిలియన్ డాలర్లు అంటే ఇండియన్ కరెన్సీలో సుమారు 5లక్షల కోట్ల రూపాయలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఈ ప్రాంతంలో గాలుల వేగం మరింత ఎక్కువగా ఉండే అవకాశాల వల్ల కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఈ కార్చిచ్చులో అతిపెద్దదైన పాలిసాడ్స్ ఫైర్ కారణంగా 15,800 ఎకరాలు, ఈటన్ ఫైర్ వల్ల ఆల్టడేనా, పసాడెనా ప్రాంతాల్లోని 10 వేల ఎకరాలు, సన్‌సెట్ ఫైర్ 5 వేలకు పైగా ఎకరాలు, హురెస్ట్ ఫైర్ సైల్మర్‌లో 700 ఎకరాలు, లిడియా ఫైర్ 340 ఎకరాలను బుగ్గిపాలు అయినట్లు అధికారులు తెలిపారు. ఉడ్లీ ఫైర్‌ను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకురాగా.... సన్‌సెట్ ఫైర్ ప్రస్తుతం హాలీవుడ్ కొండలను చుట్టుముట్టి వేగంగా విస్తరిస్తోంది. ఇక్కడ హెలికాప్టర్ల ద్వారా నీటిని చిమ్ముతున్నా మంటలు అదుపులోకి రావడం లేదు. ఈ కార్చిచ్చులో స్టూడియో సిటీ, రన్‌యాన్ కెనాన్‌లో పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. రియాల్టీ టీవీ స్టార్ పారిస్ హిల్టన్, నటులు యూజిన్ లెవీ, బిల్లి క్రిస్టల్, జాన్ గుడ్‌మన్ ఇళ్లు కూడా కాలిపోయాయి. స్టూడియో సిటీ పరిసరాల్లో చాలామంది సినీతారలు ఇళ్లను, భారీగా సంపదను కోల్పోయారు. 2005లో సంభవించిన కార్చిచ్చు తర్వాత ఇదే అతిపెద్దదని యూఎస్ అధికారులు వెల్లడించారు.

## ఈనెల 19వ తారీఖు నాడు జరిగే మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయండి



మహబూబాబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 10

శుక్రవారం రోజున మహబూబాద్ జిల్లా కేంద్రంలో అమర వీరుల స్తూపం వద్ద ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తారీఖు నాడు జరిగే మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్ర రూట్ మ్యాప్ ఖరారు చేయడం జరిగింది. ఈ రూట్ మ్యాప్ లో భాగంగా ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్ర శ్రీ వెంకటేశ్వర స్వామి అనంతరం టెంపుల్ నుండి ఉదయం 11 గంటలకు ప్రారంభమై కోర్టు దగ్గర ఉన్న అమరవీరుల స్తూపం దగ్గరికి యాత్ర ముగుస్తుంది. కావున తోటి ఉద్యమకారులందరూ ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు చిత్తారి సోమన్న నారాయణా సింగ్ రంజిత్ మధుకర్ బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# మళ్లీ యాక్షన్‌లోకి హైడ్రా

హైదరాబాద్ నగరంలో మళ్లీ హైడ్రా యాక్షన్‌లోకి దిగింది. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేస్తోంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి.. భారీ భవనాలు నిర్మించగా.. వాటన్నింటిని భారీ యంత్రాలతో నేలమట్టం చేస్తోంది. రాష్ట్రంలో చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ - హైడ్రా అధికారులు.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి భరతం పడుతున్నారు. ఇక ఇటీవలె హైడ్రాకు ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లోని బీ-బ్లాక్ కేంద్రంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తాజాగా మణికొండలోని నెక్నాంపూర్ చెరువును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే శుక్రవారం మణికొండలోని నెక్నాంపూర్ చెరువును కబ్జా చేసి.. కట్టిన కట్టడాలను కూల్చివేస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాలతో ఈ కూల్చివేతలు జరుగుతున్నాయి.

భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. నెక్నాంపూర్ చెరువు బఫర్‌జోన్‌లో భారీ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. అయితే నెక్నాంపూర్ వాసులు.. అక్కడి అక్రమ నిర్మాణాల విషయాన్ని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకురావడంతో.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి విచారణ చేపట్టారు. అందులో కొన్ని అక్రమ నిర్మాణాలుగా తేలడంతో కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

# దేశంలో పెద్దల్లో తొలిసారి హెచ్‌ఎంపీవీ వైరస్ నిర్ధారణ

దీంతో గుజరాత్‌లో హెచ్‌ఎంపీవీ కేసుల సంఖ్య మూడుకు చేరుకోగా.. దేశంలో మొత్తం బాధితుల 9కు చేరింది. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రకటన ప్రకారం.. ఆస్తమాతో బాధపడుతున్న వృద్ధుడు కొద్ది రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. అతడ్ని కుటుంబసభ్యులు బుధవారం ఆసుపత్రిలో చేర్పించగా.. గురువారం నిర్వహించిన పరీక్షల్లో హెచ్‌ఎంపీవీ ఉన్నట్టు తేలింది.

ప్రస్తుతం అతడికి ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని, ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, బాధితుడికి ఎటువంటి ట్రావెల్ హిస్టరీ లేదని తెలిపారు. అటు, ఈ వైరస్ నిర్ధారణ అయిన చిన్నారుల అందరి పరిస్థితి నిలకడగా ఉందని, వారు కోలుకుంటున్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కాగా, హెచ్‌ఎంపీవీ ఎక్కువగా వృద్ధులు, చిన్నారులపై ప్రభావం చూపుతుంది. వృద్ధులలో తేలికపాటి నుంచి తీవ్రమైన లక్షణాలు ఉంటాయి. వైరస్ సంక్రమించిన వ్యక్తిలో సాధారణంగా దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కు కారటం, గొంతు నొప్పి, శ్వాస ఆడకపోవడం, జ్వరం, అలసట వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి.

ఇక, పిల్లల విషయానికి వస్తే సాధారణంగా తేలికపాటి జలుబు లాంటి సంకేతాల నుంచి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధి లక్షణాలు గుర్తించారు. వైరస్ తీవ్రత బ్రాంకైటీస్ లేదా న్యుమోనియాకు దారితీయవచ్చని నిపుణులు చెబుతున్నారు. రోగనిరోధకశక్తి బలహీనంగా ఉండేవారికి ప్రమాదం ఎక్కువ. ఇక, దేశంలో మొదటిసారి బెంగళూరులో సోమవారం ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ నిర్ధారణ అయ్యింది. తర్వాత చెన్నై, గుజరాత్, నాగ్‌పూర్, ముంబయిలో కేసులు బయటపడ్డాయి.

కాగా, భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతోందని ఐసీఎంఆర్ తెలిపింది. ఈ వైరస్ కేసులు చైనాను దాటేసి ఇతర దేశాల్లోనూ ఇప్పుడు కేసులు నమోదు అవుతున్నాయని స్పష్టం చేసింది.

# సంపాదకీయం

## అలిశెట్టి కవిత పలికిన నగరజీవి వేదన

హైదరాబాద్ నగరాన్ని తమకు కనబడిన కోణంలో, అర్థమైన మేరకు ఎందరో కవులు రచనల్లో ప్రకటించారు. ఇక్కడి నేలకు సొంతమైన భాష, సంస్కృతులు తమ గుండెకు హత్తుకున్న తీరును హృద్యంగా వర్ణించిన వారున్నారు. అయితే నగరంలోని పేదరికం, శ్రమదోపిడి, చేతిలో పైసా లేనివాని పరిస్థితిని తనదైన రీతిలో అలిశెట్టి ప్రభాకర్ వెల్లడించాడు. నమ్మకమైన ఆదాయం లేకుండానే కుటుంబంతో సహా నగరంలో కాలుబెట్టిన అలిశెట్టికి అంతా తనలాంటి భరోసాలేని బతుకులే కంటబడ్డాయి. ఆయన పదేళ్ల నగర జీవితంలో చెప్పినదంతా సామాన్యుడి వెతలే. 19వ ఏట చిట్టి పొట్టి కవితలు రాయడం మొదలుపెట్టిన ప్రభాకర్ పుట్టి పెరిగిన జగిత్యాలలో ఆగకుండా కరీంనగర్ మీదుగా 1983లో హైదరాబాద్‌కు మారాడు. ఆయన చివరి పదేళ్ల జీవితం నగరంలోనే గడిచింది.

అలిశెట్టి ప్రభాకర్ నగరంలో అడుగు పెట్టక ముందే, దాని లక్షణాలను సరిగ్గానే గమనించి, తొలినాళ్ళ కవిత్వంలో వివరించాడు: 'ప్లాస్టిక్ సర్జరీ' అనే కవితలో, "నగరంలో/ కొన్ని నెమళ్ళుంటాయి/ కంటిలో కాదు సూటిగా/ గుండెల్లో పొడుస్తాయి/ మరెన్నో/ తోడేళ్లుంటాయి/ ఇవి మనిషినేం చేయవు/ కేవలం శ్రమను మాత్రమే/ తోడేస్తాయి/ నగరం.../ అర్థం కాని రసాయనశాల/ అందమైన శ్మశానవాటిక/ నగరం.../ చిక్కువిడని పద్మవ్యూహం,/ చెక్కుచెదరని మయసభ" అని అంతా తెలిసినట్లే రాశాడు.

1981%–%82 కాలంలో కరీంనగర్ నుంచి తన కవితా చిత్రాలు వెంటేసుకొని నెలకు ఒకటీ రెండుసార్లు నగరానికి వచ్చి వాటి ప్రదర్శనలు కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆయనకు నగరం కొత్తగా, వింతగా కనబడింది. తన కళా సృష్టికి తగిన రంగస్థలం ఇదేనని అనిపించింది.

అప్పటికే క్షయతో బాధపడుతున్న తాను ఇక్కడెలా బతుకుతాను అనే ముందూ వెనుకా ఆలోచనా లేకుండా అన్నీ సర్దుకొని నగరంలో కాలుపెట్టాడు. ఈతరానివాడు నీళ్లలో దూకినట్లుంది. అయినా కవిత్వమే తప్ప జీవన కష్టాల గురించి పట్టించుకోని ప్రభాకర్ ఆ పదేళ్లు ఇక్కడ తుఫానులో చిక్కుకున్నట్లు బతికాడు. కుటుంబం పడరాని పాట్లు పడింది. అంతా బాగున్న సొంతూరును వదిలిపెట్టి ఇక్కడికి ఎందుకు, వెనక్కి పోదాం అని ఇంటామె వేడుకున్నా వినలేదు. ఈ విషయాల ప్రస్తావన ఆయన చివరి రోజుల్లో రాసుకున్న 'మరణం నా చివరి చరణం కాదు' ముందుమాటలో చూడవచ్చు: "7 %ఇ% 14 అడుగుల స్టూడియో గదికి అయిదొందలు, భార్య ఇద్దరు పిల్లలతో ఒంటరి గదికి నూటా ఎనభై పోగా మిగిలేది అబిడ్స్‌లో సెకండ్ హ్యాండ్ పుస్తకం" అనే ఆర్థిక బాధను ఒక చోట, "పుట్టిన గడ్డ నుండి ఇక్కడికి రావడమే పొరపాటయిపోయింది" అనే పశ్చాత్తాపాన్ని మరోచోట రాసుకున్నాడు. నగరంలో కష్టాలను వివరిస్తూ "పగలు రాత్రి ఆస్బెస్టాస్ రేకుల కింద పడి ఎంత వేడెక్కినా, మాడిపోకుండా ఉండగలిగిన మానవాతీతుణ్ణి" అని రాసుకున్నాడు. అయినా అన్ని కష్టాల్లోనూ "నరకప్రాయమైన నగర నాగరికతను నర నరానా జీర్ణించుకున్నవాణ్ణి, రోజుకో రెండు కవితా వాక్యాలు రాయలేనా" అని తన ధీరత్వాన్ని ప్రకటించుకున్నాడు.

అలా నగరం ఆయనకు కొత్త కవితా వస్తువైంది. 1986లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రభాకర్ డైలీ పోయెమ్ శీర్షిక 'సిటీ లైఫ్' మొదలైంది. రోజుకొక్క కవిత రాయడమంటే మామూలు విషయం కాదు. అయినా దాన్ని ప్రభాకర్ ఛాలెంజ్‌గా తీసుకున్నాడు. అలిశెట్టి చివరి రోజు వరకు ఆ శీర్షిక కొనసాగింది. ఆదాయం కొడికట్టినవేళ ఆ పత్రిక రోజుకి ఇచ్చే ముప్పై రూపాయల పారితోషికమే అన్నం పెట్టింది. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య పీడనలో కవిత్వమే ఆయనకు ఆసరా అయింది.

ఆంధ్రజ్యోతిలో సిటీ లైఫ్ ఆయన కవిత్వానికి పాఠక విస్తృతిని పెంచింది. రోజు పత్రికను చూసేవారు ఆయన కవితను వదిలిపెట్టేవారు కాదు. ఆయన తీసుకొనే నిత్యజీవన అంశంబీ రాతలో సరళత, స్పష్టత, సూటిదనం, వ్యంగ్యం అందరిని ఆకట్టుకునేవి. అలా లక్షలాది మందికి 'అలిశెట్టి ప్రభాకర్' పేరు దగ్గరయింది.

సిటీలైఫ్ కవితల్లో ఒక కవితలో%–% నగరంలో రోజూ ఏదో ఒక దారిలో కనిపించే ఊరేగింపును "సమిష్టి బాధల/ సుదీర్ఘ శ్వాసే/ ఊరేగింపు" అన్నాడు. "నగరంలో రోడ్డుకిరువైపులా/ వేశ్యల్లా ముస్తాబై నిలుచున్న దుకాణాలు/ కన్నుగొట్టి రమ్మన్నా గుండె బిగపట్టుక/ సాగిపోయేవాడు సామాన్యుడు" అన్నాడు. నగరంలో రోడ్లను తన కోణంలో చెబుతూ%–% "నగరంలో రోడ్లు/ అడపా దడపా/ బాధల బాటసారులను మింగేసే కొండచిలువలా" ఉన్నాయంటాడు. "హైదరాబాదంతా పిండితే చిక్కని పాలు/ బంజారాహిల్స్" అని శ్రమదోపిడి రూపాన్ని బయటపెట్టాడు. "కాచిగూడా/ కాచి వడబోస్తే/ నువ్వొక నీళ్ల టీ/ నారాయణగూడా/ నీ మీంచి నడిచిపోతే/ నువ్వొక దాల్ రోటీ!/ బతకొచ్చిన కష్టజీవీ/ పట్నంలో/ నీకు నీవే పోటాపోటీ...!" అని కష్టజీవి కడుపు నింపేవేమిటో వివరిస్తాడు. "హైదరాబాదనే/ మహావృక్షమ్మీద/ ఎవరికి వారే/ ఏకాకి" అని నగర జీవనం తీరును ఎండగడతాడు. కవిత్వం కోసం కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా వెరవలేదు. అందుకే అలిశెట్టి పట్టిందల్లా 'కవిత్వం' అయింది. ఆయన నడిచిన దారుల్లో వేసిన కవిత్వ పాదముద్రలు ఎన్నటికీ మాసిపోవు.

# మహా కుంభమేళాకు యాపిల్ స్టీవ్ జాబ్స్ భార్య

**-16 రోజులు ఇక్కడే**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న 2025 మహాకుంభానికి దివంగత ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య లారెన్ పావెల్ హాజరవుతారని స్వామి కైలాశానంద జీ మహారాజ్ శుక్రవారం తెలిపారు. లారెన్ పావెల్‌కు 'కమల' అనే హిందూ పేరును తాను పెట్టానని చెప్పారు. ఆపిల్ సహ వ్యవస్థాపకుడు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య లారెన్ జాబ్స్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళా 2025కు హాజరు కానున్నారు. 61 ఏళ్ల లారెన్ జనవరి 13న ప్రయాగ్‌రాజ్ చేరుకోనున్నారు. ఆమె ఇక్కడ జనవరి 29 వరకు ఉండనున్నారు. నిరంజని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాషానంద శిబిరంలో ఆమె ఉంటారు. "ఆమె తన గురువును కలవడానికి ఇక్కడికి వస్తోందన స్వామి కైలాశానంద అన్నారు. మేము ఆమెకు కమలా అని పేరు పెట్టామని, ఆమె మాకు కూతురు లాంటిదని చెప్పారు. ఆమె భారతదేశానికి రావడం ఇది రెండోసారి. అందరికీ కుంభమేళాకు స్వాగతం చెబుతుందని ఆయన అన్నారు.

**ఇక్కడి సాధువులను**


తన వ్యక్తిగత కార్యక్రమం కోసం సందర్శిస్తున్నప్పుడు, ఆమె ధ్యానం చేయడానికి ఇక్కడికి వస్తున్నారని స్వామి కైలాషానంద తెలిపారు. అఖాడా ఊరేగింపులో పావెల్‌ను చేర్చుతారా అని అడిగినప్పుడు, "మేము ఆమెను ఊరేగింపులో చేర్చాలని యోచిస్తున్నాము" అని అన్నారు. ఈ నిర్ణయాన్ని ఆమెకే వదిలేస్తామన్నారు. ఆమె ఈ కుంభమేళాను సందర్శించి ఇక్కడి సాధువులను కలుస్తారని చెప్పారు. మన సంప్రదాయాల గురించి పెద్దగా తెలియని వారు కూడా నేర్చుకోవాలనుకుంటారని వెల్లడించారు. 2020 ఫోర్బ్స్ నివేదికలో ప్రపంచ బిలియనీర్ల జాబితాలో లారెన్ జాబ్స్ 59వ స్థానంలో నిలిచారు. స్టీవ్ జాబ్స్ అక్టోబర్ 5, 2011న మరణించారు.

**ఏర్పాట్లు పూర్తి**

"ప్రపంచంలోని చాలా మంది ప్రజలు ఎవరో ఒక గురువు మార్గదర్శకత్వంలో ఉన్నారు. చాలా మంది కుంభమేళాకు వస్తున్నారు, కొందరు తమ వ్యక్తిగత కార్యక్రమాల కోసం వస్తున్నారని ఆయన అన్నారు. స్వామి కైలాసానంద జీ మహారాజ్ కుంభమేళా ఒక మతపరమైన ఉత్సవమని అన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలు ఆశీర్వాదం పొందడానికి మహా కుంభ్ కు వస్తారని చెప్పారు. అంతకుముందు ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ మాట్లాడుతూ జాతరకు సంబంధించిన అన్ని సన్నాహాలు పూర్తయ్యాయని అన్నారు.

**ప్రత్యేక రేడియో ఛానల్**

ఈసారి భక్తులు గొప్ప కుంభమేళాను వీక్షించగలరని ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య హామీ ఇచ్చారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు చాలా దివ్యమైన, గొప్ప సన్నాహాలు చేయబడ్డాయన్నారు. జనవరి 13న జరిగే కుంభమేళాను జరుపుకునేందుకు వేచి చూస్తున్నట్లు చెప్పారు. అందరినీ స్వాగతించడానికి, వారి సురక్షితమైన స్నానాన్ని నిర్ధారించడానికి అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపారు. ఇదిలా ఉండగా మహా కుంభ్ కోసం ప్రత్యేక రేడియో ఛానల్ 'కుంభవాని'ని ప్రారంభించినందుకు ప్రసార భారతి చేసిన కృషిని ఉత్తరప్రదేశ్



ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. జనవరి 13 నుంచి మహా కుంభమేళా ప్రారంభమవుతుంది.

**ఎప్పటివరకు..**

దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే కనెక్టివిటీ సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నందున, ఈ రేడియో ఛానల్ వారికి కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. మహా కుంభ్‌లో జరిగే కార్యక్రమాలను మేము ప్రసారం చేయగలమని, తద్వారా మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా దీనిని వినగలుగుతారని తెలిపారు. 12 సంవత్సరాల తర్వాత ఈ మహా కుంభమేళా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 45 కోట్లకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా. మహా కుంభమేళా సందర్భంగా భక్తులు గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద పవిత్ర స్నానం కోసం పెద్ద ఎత్తున తరలివస్తారు. మహా కుంభమేళా ఫిబ్రవరి 26న ముగుస్తుంది.

# దళిత హెడ్మాస్టర్ రాములు పై సనాతన వాదుల దాడి

**నిజనిర్ధారణ రిపోర్ట్**

రంగారెడ్డి జల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయుడు కంబాలపల్లి రాములు (మాదిగ)పై బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు అయ్యప్పలను ముందు పెట్టి 23 డిసెంబర్ 2024 రోజున కులం పేరుతో దూషించి అవమానపరిచి దాడి చేసి, విద్యార్థి కాలు మొక్కించిన విషయంలో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం, తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాలు ఒక నిజ నిర్ధారణ బృందంగా ఏర్పడి డిసెంబర్ 31, 2024న ప్రభుత్వ హైస్కూల్లో రాములు సార్ నీ కలిసి పరామర్శించి జరిగిన ఘటన వివరాలు తెలుసుకోవడం జరిగింది.

రాములు సార్ 2023 సెప్టెంబర్ 18న ట్రాన్స్ఫర్ పై తుక్కుగూడ హై స్కూల్ కి వచ్చాడు. ఈ స్కూల్లో బాల బాలికలు మొత్తం కలిపి 430 మంది పేద విద్యార్థులు ఉన్నారు. 8వ తరగతిలో ఏ బి సెక్షన్లు కలిపి 124 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే 21-12-2024న ఎనిమిదవ తరగతి ఏబి సెక్షన్ల విద్యార్థులను స్కూలు ఆవరణలోని చెట్ల కింద కూర్చోబెట్టి ఎక్కలు అందరినీ అడిగారు. ఆ వరుసలో ఉన్న అయ్యప్ప మాల దారి అయిన బానోతు అరుణ్ అనే విద్యార్థి ని కూడా రాములు సారు లెక్కలు అడిగారు. లేచి లెక్కలు చెప్పకపోవడంతో దగ్గరికి వెళ్లి వెనక్కి నుంచి లేపే క్రమంలో రాములు సార్ మోకాలు విద్యార్థి వీపుకు తగిలింది. అయినప్పటికీ ఆ విద్యార్థి లెక్కలు చెప్పలేడు. బెల్ కావడంతో విద్యార్థులు వెళ్లిపోయారనీ నిర్దిష్టంగా ఇది జరిగిందని రాములు సారు మాతో చెప్పారు. మరుసటి రోజు అనగా 23 డిసెంబర్ 2024న ఉదయం 11గంటల సమయంలో తుక్కుగూడ హై స్కూల్ కు బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు అయ్యప్పలను ముందు పెట్టుకొని ఒక గుంపుగా స్కూల్ కి చేరుకున్నారు. ఆ సమయంలో రాములు సార్ స్కూల్లో లేడు. ఆ గుంపు, స్కూలు టీచర్లతో దురుసుగా ప్రవర్తిస్తూ రాములు సార్ ను పిలిపియ్యండి లేకపోతే మీ అంతు చూస్తాం అంటూ బెదిరించారు. రాములు సార్ కు ఫోన్ చేసి స్కూల్ కు రమ్మని హెచ్చరించారు. విషయం తెలిసినప్పటికీ కొంత ఆందోళనతో స్కూల్ కి రాములు సార్ తో పాటు వార్డ్ కౌన్సిలర్ తో స్కూల్ కి చేరుకున్నారు. వచ్చి రాగానే సారు తో వాగ్వివాదం జరుపుతూనే కులం పేరుతో దూషిస్తూ దాడికి తెగబడ్డారు. ఆ స్వామిని పైకి లేపి లెక్కలు అడిగే సమయంలో సహజంగానే కాలు తగిలింది తప్ప అది ఉద్దేశపూర్వ పూరితంగా జరిగింది కాదని రాములు సార్ వివరణ ఇచ్చినప్పటికీ వినకుండా ఆ ఉన్మాద గుంపు తనపై దాడి చేశారన్నారు. ఇంక వినకుండా క్షమాపణ చెప్పమని ఆ విద్యార్థి కాళ్లు మొక్కమని అంతే కాకుండా అందరి కాళ్లు మొక్కించారని ఇదంతా నేను దళితుడని తెలుసుకొని కుట్రతోనే దాడి చేశారని, సంబంధిత వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం మీకు తెలిసింది కదా అని ఆవేదనతో చెప్పుకొచ్చారు. ఆ దాడి నుండి తేరుకున్న రాములు సార్, ఉపాధ్యాయుల సలహా మేరకు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కానీ స్థానిక బజరంగ్దళ్ నాయకుల ఒత్తిడితో కేసు వాపస్ తీసుకున్నారు. ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక సంఘాలు, పౌర సమాజం నుండి పెద్ద ఎత్తున




మద్దతు రావడంతో రాములు సార్ మరోసారి ఏసీపీ కి కంప్లైంట్ చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదయింది. కానీ నిందితులను అరెస్టు చేయలేదు. ఎంఈఓ 28న స్కూల్ నీ సందర్శించారు. ఇప్పటిదాకా ఈ విషయం పట్ల డి ఇ ఓ స్పందన లేదు. మొత్తంగా ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన అధికారులు ఇంతటి ఘోరం జరిగినా కూడా పట్టించుకోలేదు.

**అసలు రాములు సార్ చేసిన నేరం ఏమిటి ?**

పిల్లల్ని లెక్కలు అడగడం తప్పా, చదువుకునే వయసులో చదువుకోకుండా మాల వేసుకొని స్కూల్ కి రావడం తప్ప అంటే మాల ధరించాడు కనుక అబ్బాయి చదివినా చదవకపోయినా పట్టించుకోవద్దు లేదా దండించవద్దు అంటున్నారు. మాకు విద్యాబుద్ధులు జ్ఞానం కంటే ఈ మత విశ్వాసాలే ముఖ్యమని విద్యార్థుల్లో చొప్పించడం సరైనదేనా? పిల్లలు చదివి జ్ఞానం పొందకుండా వారు సామాజికంగా రాజకీయంగా ఎదగకుండా మాలలు వేసుకోమని ప్రోత్సహించడాన్ని మనం ఎట్లా అర్థం చేసుకోవాలి. పిల్లల్ని చదివించాలనేది తపన తప్ప ఓ టీచర్ కి విద్యార్థులపై వ్యతిరేకతలు ఉండవు. నిజంగా ఒకవేళ ఆ విద్యార్థికి అవమానము జరిగింది నిజమైతే ఆ అబ్బాయి తల్లిదండ్రులు వచ్చి ప్రధానోపాధ్యాయుని ప్రశ్నించాలి లేదా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవాలి ఇవి ఏవి జరగలేదు. పైగా ఈ దాడిలో వారి ప్రమేయం కూడా లేదు, వారి పాత్ర లేదు. కేవలం కాలు తగలడంతో వారి మనోభావాలు దెబ్బతిన్నాయి అనే విశ్వాసం కంటే కూడా బలమైన కారణం దాడుల వెనక ఉంది. విద్యార్థులను శాస్త్రీయమైన హేతుబద్ధమైన జ్ఞానము నుండి దూరం చేయాలనే కుట్ర ఉన్నది. అంతేకాకుండా విద్యార్థి యువతలో లుంపెనిజాన్ని అభివృద్ధి చేయడానికి సనాతన వాదులు ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారు, దాడులకు తెగబడుతున్నారు.

ఈ మొత్తం సంఘటనను మనం ఒకసారి పరిశీలిస్తే వాస్తవంగా రెండు సంవత్సరల కాలంగా తెలంగాణలో మనువాద శక్తులు దళితులపై, అంబేద్కర్ ఐడియాలజీ పై అంబేడ్కరిస్టులపై హేతువాదులపై ప్రజాస్వామ్యవాదులపై దాడులకు తెగబడుతున్నారు. కోస్గి ప్రాంతంలో అంబేద్కర్ జ్ఞాన మహాసభలు వేలాది మందితో నిర్వహించిన సందర్భంగా ఆ జ్ఞాన మహాసభలకు అండదండలుగా ఉన్నాడని గుండుమల్ గ్రామానికి చెందిన బాలరాజు (దళిత) పై కుట్రపూరితంగా దాడి చేశారు. బోధన్ లో దళిత టీచర్ మల్లికార్జున్ పాఠ్య పుస్తకంలో సిలబస్ ప్రకారం ఉన్న సైన్స్ పాఠాన్ని విద్యార్థులకు చెబుతున్నాడని అది హిందూ మతానికి వ్యతిరేకంగా ఉందని ఆయన పై దాడి చేసి క్షమాపణలు చెప్పించారు. గత నెల క్రితం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యార్థి మాల వేసుకోవడం తో పరీక్షలపై దృష్టిని కేంద్రీకరించకపోవడం వల్ల తక్కువ మార్కులు వచ్చాయని, మాల తీసి మంచిగా చదువుకోమని టీచర్ సూచించడాన్ని సహించలేక ఆయనను దూషిస్తూ క్షమాపణలు చెప్పించారు. ఇప్పుడు ఏకంగా దళిత హెడ్మాస్టర్ పై దాడి చేసి విద్యార్థి కాళ్లు మొక్కించారు. ఒకవైపు గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర గురు సాక్షాత్ పరబ్రహ్మ అంటే గురువు సాక్షాత్తు దేవుడితో సమానమని చెబుతూ మరోక వైపు గురువులతో కాలు ముగించుకోవడం గురువులపై దాడులకు తెగబడటాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ సంఘటనలన్నీ కూడా మనకు చెబుతున్నది ఏమిటంటే ప్రధానంగా దళితులను టార్గెట్ చేసుకొని విద్యావ్యవస్థ పైన ఆ పాఠ్య పుస్తకాల్లో ఉన్నటువంటి సైన్సు పైన, మహనీయుల యొక్క భావాల పైన దాడి చేస్తున్నారు. దళిత శ్రామిక పేద పిల్లలకు నిలయంగా మారిన ప్రభుత్వ విద్యా వ్యవస్థను ధ్వంసం చేయాలని కుట్ర కూడా ఇక్కడ దాగి ఉందని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మనువాద శక్తులు అధికారాన్ని పొందడానికి దాడులు, హింసను మార్గంగా ఎంచుకున్నారు. ఎన్నికల సమయంలో మనమంతా హిందువులం గంగ సింధు బంధువులమంటూ ఉపన్యాసాలు దంచి కొడుతూ దళితుల ఓటు బ్యాంకు ను కొల్లగొడుతున్నారు. ఓట్ల వరకు ఓడ మల్లన్న ఓటు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్టు గుడి బడి దగ్గర మాత్రం మీరు అంటరాని వారు అని అవమానిస్తూ దాడులకు తెగబడడాన్ని దళిత సమాజం ఆలోచించాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులు మహనీయుల త్యాగాలు, వారి కృషిని పోరాటాల చరిత్రను విద్యార్థులకు చెప్పవద్దు అనే కుట్రలో భాగంగా ఉపాధ్యాయులపై దాడులకు తెగబడుతున్నారు. అందుకనే కేంద్ర ప్రభుత్వం చాలా రాష్ట్రాల్లో పాఠ్యప్రణాళికలో ఉన్న అనేక చరిత్ర పాఠ్యాంశాలను తొలగిస్తూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ %చీజు% ని తీసుకువచ్చి కుల వ్యవస్థను బలోపేతం చేసే పనికి పూనుకున్నారు.

అందుకనే పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచి తమ ఆలోచనని తమ ఆదేశాలను కిందిస్థాయి కార్యకర్తలకు పంపారు. కనుకనే బిజెపి దాని అనుబంధ సంస్థలు ఈ పనికి పూనుకున్నాయి. ఇవన్నీ మనం అర్థం చేసుకోవాలి. ఒకవైపు సనాతన ధర్మం పేరుతో దళితులపైన విద్యా వ్యవస్థ పైన దాడులు చేస్తు మరొకవైపు మన సనాతన ధర్మం పైన ముస్లింలు క్రిస్టియన్లు దాడులకు తెగబడుతున్నారని అగ్రకులాలను పైకులాలను రెచ్చగొడుతూ హిందువులను హిందూ ఓటు బ్యాంకు ను సమీకరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఎత్తుగడను అమలు చేయడంలో భాగంగానే ఇదంతా జరుగుతున్నది. ఈ విషయాన్ని దళితులు, అణగారిన కులాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, బుద్ధి జీవులు, పౌర సమాజం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

**నిజ నిర్ధారణ బృందం**

**గన్నారపు సరోజన**

**జే చక్రవర్తి**

**ఈరపాగ గోవిందు**

**తలారి నరేష్**

తెలంగాణ సేన

శనివారం ,11, జనవరి, 2025

## జడ్.పి.హెచ్.ఎస్ బూరుగుపల్లి గ్రామంలో విజ్ఞాన ప్రదర్శన




సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టి వై ఆర్ ఫౌండేషన్ మరియు విజ్ఞాన దర్శిని కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టి వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది టి. రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా గజ్వేల్ పట్టణ ప్రభుత్వ పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు మరియు బీరువాలు అందిస్తున్నామని అన్నారు. వీటి ద్వారా పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగ జరుగుతుందన్నారు. అనంతరం విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు రమేష్ సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలు ఆచారాలు వాటిని నిర్మూలించుటకు పలు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో టి వై ఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు టి. సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, అర్జున్, అబ్దుల్ రఫీక్, కవిత, ప్రసన్నలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ ముకేశ్ చంద్రకర్ హత్యను ఖండించండి

-ప్రజాస్వామ్య దేశంలో వాక్, స్వాతంత్ర్యపు స్వేచ్ఛను కాపాడలేని స్థితిలో ప్రభుత్వాలు
-ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలి
-తెలంగాణ ప్రజా ఫ్రంట్

హైదరాబాద్, తెలంగాణ సేన

ఫ్రీ లాన్సర్ జర్నలిస్ట్ ముకేశ్ చంద్రకర్ హత్య దోపిడీదారుల పనేనని, ఆయా హత్యకు కారకులైన వారిపై చర్యలు చేపట్టాలని నిరసిస్తూ ఈరోజు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైదరాబాద్ జిల్లా కో కన్వీనర్ కడమంచి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ముత్తన్న మాట్లాడుతూ ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా ప్రాంతానికి చెందిన ముఖేష్ చంద్రకర్ 'బస్తర్ జంక్షన్' పేరుతో ఒక యూట్యూబ్ ఛానల్ ను నడిపిస్తూ ఫ్రీలాన్సర్ జర్నలిస్ట్ గా అక్కడి ప్రజలకు సేవలందిస్తూ ఆయా ప్రాంతంలో ఆదివాసులపై జరుగుతున్న దాడులను, ప్రభుత్వాలు, కాంట్రాక్టర్లు చేస్తున్న అవినీతి, అక్రమ దోపిడీనీ వెలికితీస్తున్న క్రమంలో కాంట్రాక్టర్లు అతనిపై కుట్రపన్ని ఈనెల ఒకటో తారీఖున ఆయనను అతి కిరాతకంగా చంపి అక్రమాలకు పాల్పడిన గుత్తేదారు తన యొక్క ఫామ్ హౌస్ లోని సెప్టిక్ ట్యాంక్ లో పడి వేయడం జరిగింది. ఇలా ప్రశ్నించిన వారిపై, వారి అక్రమాలను వెలికి తీసిన జర్నలిస్టులపై పాషవికంగా దాడులు చేసి హత్యకు గురి చేయడం చాలా ఆందోళనకార విషయమని ముకేశ్ చంద్రకర్ హత్యను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి ఆయన హత్యకు




కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేయారు. అలాగే ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి చైతన్య మహిళా సంఘం తరపున హాజరైన శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై తన గళం విప్పుతూ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రభుత్వ అధికారులు, గుత్తేదారుల అవినీతిని బయటపెట్టిన ముఖేష్ చంద్రకర్ హత్యను ప్రజాస్వామిక వాదులుగా ఖండించాల్సిన అవసరం ఉందని ఇలాంటి చర్యలు ముందు ముందు జరగకుండా ప్రభుత్వాలు ఫ్రీ ల్యాన్సర్ జర్నలిస్టుల కోసం రక్షణ చట్టం తీసుకురావాలని వారు మాట్లాడారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమని, ఇది వాక్ స్వాతంత్రపు చట్టానికి విరుద్ధమని, రోడ్డు అభివృద్ధి పనులలో జరుగుతున్న కోట్ల రూపాయల అవినీతిని బయటపెట్టిన ముకేశ్ చంద్రకర్ ను హత్య చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమే అని, ముఖేష్ చంద్ర కర్ హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళన చర్యలు చేపడతామని వారన్నారు. అలాగే ఒక కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కామగొని శ్రవణ్ మాట్లాడుతూ దేశంలో పరిస్థితులను చూస్తుంటే ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతూన్న వారి పక్షాన ఉంటూ, ప్రజా సమస్యలపై పోరాడుతున్న జర్నలిస్టులను కాంట్రాక్టు గుండాలు అతికిరాతకంగా హత్య చేసిన సెప్టిక్ ట్యాంక్ లో పడివేసి గుర్తుపట్టలేనంతగా అతని మృతదేహాన్ని చిద్రం చేసిన అక్కడి ప్రభుత్వం కనీసం ఆయా దోపిడీ కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టకపోవడం చాలా సిగ్గుచేటని, ఇది చాలా దుర్మార్గమైన చర్యగా ఖండిస్తూ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ పై దాడి చేసిన ఆ అవినీతి గుండాలపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా కోకన్వీనర్ విజయ్ కృష్ణ, విద్యార్థి నాయకులు మద్రి మహేష్, యాదగిరిలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, వాక్ స్వాతంత్రపు స్వేచ్ఛను కాపాడవలసిన అధికారులు, ప్రభుత్వ నాయకులు కాంట్రాక్టు దోపిడీదారులకు వత్తాసు పలుకుతూ ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ, హత్యలకు గురిచేస్తున్న ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటని వారన్నారు. అలాగే ఈ యొక్క కార్యక్రమంలో భువనేశ్వర్, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకరణ మహోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, తెలంగాణ సేన :
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి మరియు డైరెక్టర్ గా శ్రీనివాస్ చారీ, రవీందర్, రాజు, వేణు గౌడ్ గార్లు నియమితులైన సందర్భంగా శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మ రెడ్డి, క్రిష్ణ గౌడ్, రషీద్, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకకు ఇక నో పర్మిషన్.

-చిన్నగూడూర్ తహసిల్దార్ మహబూబ్అలీ

మహబూబాబాద్ రూరల్ చిన్నగూడూరు మండలం తెలంగాణ సేన జనవరి 10



చిన్నగూడూరు ఆకేరు పరివాహక ప్రాంత పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం వుంది అంటూ రైతులు అర్జీలు పెడుతున్న నేపథ్యంలో %=ణూ% గణేష్ ఆదేశాల మేరకు చిన్నగూడూర్ తహసిల్దార్ మహబూబ్ ఆలీ ఇసుక కూపన్ లను నిలిపిస్తున్నట్టు తెలిపారు. అత్యవసర వర్క్ లకు కూపన్ లు వున్నప్పటికి రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఇసుక కూపన్ లను నిలిపివేయడం జరిగింది అని ఎవరైనా అక్రమ ఇసుక రవాణా కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ హెచ్చరించారు.

# ఇందూరు పాఠశాలలో జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు

-పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్
-అతిథులుగా బోధన్ డివిజన్ ఏసిపి శ్రీనివాస్
- పట్టణ సిఐ వెంకట్ నా రాయణ
-బోధన్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్
-ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చందర్ రాథోడ్ లు పాల్గొన్నారు



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఇందూరు పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోధన్ డివిజన్ ఏసిపి శ్రీనివాస్, అతిథులుగా పట్టణ సిఐ వెంకట్ నారాయణ, బోధన్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చందర్ రాథోడ్ లు పాల్గొని విద్యార్థులకు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తూ వాహనాలను ఎలా నడపాలి, వాహనని నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, రోడ్డు దాటే సమయంలో పాటించవలసిన నియమాల గురించి తెలిపారు. విద్యార్థులు తమ ఇంట్లో తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు వాహనాల నడిపే సమయాన తీసుకోవలసిన తగు జాగ్రత్తలు పాటించే విధంగా చూడాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలను నడపరాదని నడిపినట్లయితే చట్టరీత్యా చర్యలు వాహన యజమానులకు కూడా చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోబడతాయని కాబట్టి వాహన నియమాలను కచ్చితంగా పాటించవలసిందిగా తెలిపారు. కార్యక్రమానంతరం పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ పాఠశాల తరపున ముఖ్య అతిథిని, అతిథులను శాలువా పూలగుచ్ఛంతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎంవీఐ అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మరో ఏడాది పాటు కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ పదవి పొడగింపు...

-రామకృష్ణ ను సన్మానించిన బీజేపీ నాయకులు.



కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 10 :
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ పదవి కాలం మరో ఏడాది పాటు పొదగించడం తో బీజేపీ సీనియర్ నాయకులు, పూర్వ బీజేపీ వార్డ్ అధ్యక్షులు రామకృష్ణ ను కలిసి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ "భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం గల పార్టీ అని పనిచేసే ప్రతి వ్యక్తికి గుర్తింపును ఇస్తుందని కంటోన్మెంట్ లోని పూర్వ బీజేపీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు కృషితో కంటోన్మెంట్ ను అనేక అభివృద్ధి పనులు చేపట్టామని అందుకు తగిన గుర్తింపుగా తిరిగి మరో అవకాశాన్ని అందించారని, ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి, కంటోన్మెంట్ ప్రజల సేవకై తనకు మరో అవకాశం లభించిందని ఈ పదవి, కంటోన్మెంట్ ప్రజల సహకారం, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తల ఆశీర్వాదం వల్ల లభించిందని పేర్కొంటూ ప్రజల మధ్యలో ఉండి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బీఎన్ శ్రీనివాస్, అశోక్, రజమల్లేష్, అజయ్ గౌడ్, కిరణ్ కుమార్, విజయ్, నాగభూషణం రెడ్డి, శ్రీధర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బి ఫార్మసీ కళాశాల లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



మహబూబాబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 10

శుక్రవారం రోజున మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ని సాంఘిక సంక్షేమ శాఖ బి ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి పండుగ, సంబరాలు, నిర్వహించారు పురస్కరించుకొని రెసిడెన్షియల్ గురుకులంలో ముగ్గులు వేసి ఆటపాటలతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న రెడ్డి,మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ అంటే ఆడపడుచులు కొత్త బట్టలతో వాకిట్లో ముగ్గులతో, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే విధంగా, పండుగలు, జరుపుకుంటారు, రైతులు తమ పంట చేతికి వచ్చిన సందర్భంగా ఎంతో సంతోషం తోటి ఈ సంక్రాంతి ని ఘనంగా పండుగ వాతావరణంలో, చేసుకుంటరు మన తెలంగాణ పండుగలు అయిన దసరా, బతుకమ్మలను మన సాంప్రదాయాలకు అద్దం పట్టే ,ప్రతి, పండుగను, విద్యార్థినీల మధ్యలో..జరుపుకోవడం మా కళాశాల ఆనవాయితీ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోడా ,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సునీత, సూపరింటెండెంట్ అరుణ కుమారి, వివిధ అధ్యాపకులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమ ప్రభావితులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

-జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ



నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, జనవరి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినందున , ప్రత్యామ్నాయ వస్తువులను అందరూ వినియోగించాలని, ఆ దిశగా సామాజిక మాధ్యమ ప్రభావితులు ( సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ ) సామాజిక బాధ్యతతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు, వ్యాపారులకు విస్తృత అవగాహన కల్పించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్లో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్. ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ తో కలిసి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సెర్స్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో జనవరి 1వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించడమైనదని, అందులో భాగంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నకు బదులుగా ప్రత్యామ్నాయమైన, పర్యావరణహితమైన వస్తువులు విరివిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి దుకాణదారునికి ప్లాస్టిక్ నకు బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అమ్మకాలు జరిపే వ్యాపారుల ఫోన్ నెంబర్లు ఇప్పటికే అందించామని తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుతం వినియోగిస్తున్న టీ కప్పులు కూడా కాగితం కప్పులు వలే కనిపిస్తున్నప్పటికీ అందులో కూడా ప్లాస్టిక్ పొర ఉంటుందని ప్రాక్టికల్ గా అదనపు కమిషనర్ వారికి ప్రదర్శించి వివరించారు. అందువలన ఒకసారికి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీలు, గాజు, పింగాణి, పేపర్, వస్త్ర ,నార తదితర ప్రత్యామ్నాయమైన వస్తువులను వినియోగించేలా సోషల్ మీడియాలో ప్రచారం కల్పించాలని కోరారు. అలాగే ప్రజలలో అవగాహన, సమాచారం కొరకు సోషల్ మీడియా ప్రభావితులతో కలిపి ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తామని ,ఏ ప్రాంతంలోనైనా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న దుకాణాదారుల వీడియో లేదా ఫొటోలను గ్రూపుల్లో పెట్టినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. తద్వారా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పూర్తిగా నిర్మూలన జరుగుతుందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ పై విస్తృత ప్రచారం చేపట్టేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సెర్స్ సహకారం జీవీఎంసీ కి అవసరమని వారికి తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రజా వెలుగు దినపత్రిక, కాకినాడ జిల్లా,రౌతులపూడి, డిసెంబర్ 10:



ములగపూడి గ్రామంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా కోదండ రామ దేవస్థానం వారు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ అంగరంగ వైభవంగా జరిగింది. పలు గ్రామాలనుండి హిందువు భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని శ్రీరామ నామ కీర్తనలతో రామగిరి చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు చిలుకూరి రామకుమార్, మండల బిజెపి అధ్యక్షులు లగుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి యెనుముల రాజా, కోరుప్రోలు నానాజీ, చింతకాయల సత్యనారాయణ, దేవస్థానం కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి ప్రత్యేకత

**-ముక్కోటి ఏకాదశి శుక్రవారం రోజున ఉత్తరద్వార దర్శనం చేస్తే కలిగే పుణ్య ఫలం**
**-వైకుంఠ ఏకాదశి కథ, ముప్పది మూడు కోట్ల దేవతలతో**
**-అనంతమైన పుణ్యఫలం వస్తుంది అని చెప్పుకోవాలి**
**ప్రజా వెలుగు దినపత్రిక ప్రతినిధి. జనవరి 10**



**ముక్కోటి ఏకాదశి శుక్రవారం రోజున ఉత్తరద్వార దర్శనం చేస్తే కలిగే పుణ్య ఫలం ఏమిటి?**

అనంతమైన పుణ్యఫలం అని చెప్పుకోవాలి. భారతీయులు కాంతిని ఆరాధించేటటువంటి వారు. ప్రాఙ్ముఖంగా ప్రయాణించేటటువంటి వారు. దేహంలో ఎప్పుడూ కూడా ఎడమ భాగాన్ని కుడి భాగం నియంత్రిస్తూ ఉంటుంది. వామ భాగం స్త్రీ సంబంధితమైనటువంటి భాగం. ప్రేమ, పారమార్థిక దృష్టి, లౌకిక సుఖములు, ఆనందములు ఇవన్నీ కూడా ఉత్తర దిక్భాగంలో ఉంటాయి. వీటన్నింటినీ నియంత్రించేది ఎడమ భాగం. అలాగే మన దృష్టి కూడా నిరంతరం ఎడమ వైపుకే ప్రసరిస్తూ ఉంటుంది. ఉత్తరం దిక్కుకు ధనము, సంపద వంటి వాటికి ప్రాముఖ్యత ఉంది. అన్నింటికంటే మించి ఈ విశాల విశ్వమంతా కూడా తన చుట్టూ తానూ తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది అనుకుంటే ఈ విశ్వంలో ఉండే అంతర్భాగము ఆక్సిల్ అంటారు దానిని అది దీనికి వ్యతిరేకంగా తిరుగుతూ ఉంటుంది. ఈ విశ్వము దక్షిణం వైపునుంచి ఉత్తరం వైపుకు అంటి క్లాక్వైస్ తిరుగుతూండగా అందులోని అంతర్భాగం ఉత్తరం వైపునుంచి దక్షిణానికి క్లాక్వైస్ తిరుగుతుంది.ప్రాగ్ ఆరభ్య దక్షిణేణ వర్తనం మన హిందూ ధర్మంలో అందుకోసమే ఆలయానికి వెళ్తే ప్రదక్షిణ చేయాలి – ప్రాగ్ ఆరభ్య దక్షిణేన వర్తనం. ఉత్తరంగా, ఈశాన్యంగా, తూర్పుగా, ఆగ్నేయం, దక్షిణం ఇలా ప్రదక్షిణ చేస్తూ ఉంటాం. కనుక ఈ రెండింటి మధ్య ఉండే వైరుధ్యం వల్ల కలిగిన ఆకర్షణ శక్తి చేత మనం ఈ భూమిమీద అంటిపెట్టుకొని ఉన్నాం దానికే భూమ్యాకర్షణ శక్తి అని పేరు.

ఈరోజున ఉత్తర దిగ్భాగ మార్గాన్ని అనుసరించి ఇంక రెండు మూడు రోజులలో సూర్యనారాయణ మూర్తి ఉత్తర దిగ్భాగంలో ప్రయాణం చేస్తూంటాడు. ఈరోజున మనం ఉత్తర దిగ్భాగంతో ప్రయాణం ప్రారంభం చేసినట్లయితే తప్పకుండా కైవల్యం లభిస్తుంది. ఈ భూమితో ఉండే ఆకర్షణ సంబంధిత సంబంధాలన్నీ కూడా తొలగిపోయి ఆ శ్రీమన్నారాయణ మూర్తిని చేరుకుంటాము. భవ బంధనాలన్నీ కూడా తొలగిపోతాయి. అనేటటువంటి రహస్యాన్ని కనుగొన్న ప్రాచీనులు ఈ అంశాలన్నీ కూడా శాస్త్రోక్తంగా చెప్తే అందరికీ అర్థం అవుతాయో లేదో అనే ఉద్దేశ్యంతో కథలను జోడించి విభీషణ శరణాగతి కథ, వైకుంఠ ఏకాదశి కథ, ముప్పది మూడు కోట్ల దేవతలతో ఆ స్వామి ఈనాడు మనకు దర్శనమిస్తాడు. మూడు కోట్లతో రంగధాముని దర్శనమిస్తాడు. ఇలా చెప్పి ఆలయాలవైపు మనల్ని మరల్చారు. స్వామి దర్శనం చేసుకోండి అంటూ అనుజ్ఞనిచ్చారు. మన ప్రయత్నం కాకుండా గురువుతో ప్రయత్నం కావాలి. స్వప్రయత్నం కూడదు అంటుంది ధర్మము. కాబట్టి నారాయణుడే అటువంటి మనలో జ్ఞానమును ప్రేరేపించు వాడు. ఆయన ప్రపన్నుడు. అడిగిన వాళ్ళందరికీ కూడా ఆశ్రయం ఇచ్చే ప్రపన్నుడు. ఎవరిని రక్షించాలా? అని సంసిద్ధుడై ఉంటాడుట. కాబట్టి ఉత్తర ద్వార దిశగా మనం ప్రయాణం చేస్తే తప్పకుండా కోరిన కోరికలు నేరవేరుతాయి. అన్నింటికంటే కోరవలసినది ఏమున్నది? – ఈ లోకంతో భవ బంధనాలనుంచి విముక్తి. మోక్షము అంటే "ముచిల్ మోక్షణే అని అర్థం. బంధనాలనుంచి ముక్తిని పొందడము, విముక్తిని కలిగించుకోవడము అని అర్థం. అందుకే ఉత్తర దిశ ఇంత ప్రాముఖ్యం కలది, ఇంతగొప్ప విశేషత ఈ పండుగకు ఉన్నది.

# లడ్డు దీక్ష తో రాద్దాంతం చేసిన పవన్

**- తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన బాధితులు గురించి ఏ దీక్ష చేస్తాడో చెప్పాలి**
**- సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ**

కాకినాడ జిల్లా పిఠాపురం సంక్రాంతి సంబరాలు పేరుతో పిఠాపురం ఎమ్మెల్యే రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన హాస్యాస్పదం నగాఉందని గోసాల నిర్మాణం అని ప్రత్యేక కార్యక్రమంతనువంతుగా మాతా ప్రచారకర్తగా వ్యాహరించడం ముస్లిం క్రిస్టియన్ మనోభాలు దెబ్బతీసినట్లుగాఉందని నియోజవర్గ ప్రధాన సమస్యలు గాలికి వదిలేసి గోసాల నిర్మాణం చేపట్టడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్ ఆలోచన విధానం ఏంటో చెప్పాలని గోశాల ఏర్పాటు చేయడానికి గోవులను పరిరక్షించడానికి స్వామీజీలు పీఠాధిపతులు చాలామంది ఉన్నారని దానికి డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి పెట్టనవసరం లేదని గోపాల్ నిర్మాణం అనే కార్యక్రమం బదులు పాడిపరిశ్ర డెలెవ్ వెంటు అని పాడిపరిశ్రమ అభివృద్ధి చేస్తేబాగుండేదనిఎన్నికలు హామీలో భాగంగా సూపర్ సిక్స్ హామీలు ఎలా అమలు చేస్తారో ఎప్పుడు అమలు చేస్తారు మాట్లాడకుండా హిందుత్వాన్ని భుజాన్న వేసుకునే కార్యక్రమాలు ఆసక్తి చూపడం దారుణమని మోడీ స్క్రిప్ట్ పవన్ యాక్టింగ్ అన్నట్లుగా పర్యటన సాగిందనితప్ప ప్రజా సమస్యలను స్పందించే విధంగా లేదని సిపిఐ నాయకులు సాక రామకృష్ణ పవన్ పర్యటన ఉద్దేశించి మీడియా సమావేశంలో మాట్లాడారు లడ్డు గురించి రాష్ట్రమంతా రద్దాంతం చేసిన పవన్ కళ్యాణ్ తిరుపతి తొక్కిసలాట్లో మీ అశ్రద్ధ వలన6గురుమృతిచెందారు 40 మంది గాయాలు పాలు అవుతే ఏ దీక్ష చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు , అల్లుఅర్జున్ బయటికి వస్తే తొక్కిసలాటలో యువతి చనిపోయిందని



అల్లుఅర్జున్ మేలు కేసు కట్టి భీభత్సం చేసారు రామ్ చరణ్ నటించిన గేమ్ చేంజ్ ఈవెంట్ కొచ్చి ఇద్దరూ యువకులు చనిపోయారని దానికి చరణు పవన్ కళ్యాణ్ ని అరెస్ట్ చేయాలని ఆయన అన్నారు, విశాఖలో రెండు లక్షల కోట్లు తో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని గొప్పగా చెబుతున్న పవన్ రాజధాని, పోలవరం, ప్రత్యేక హోదా నిరుద్యోగుల ఉద్యోగ కల్పన గురించి మాటేమిటి అన్నారు హిందుత్వాన్ని సపోర్ట్ చేస్తూ వ్యవహరిస్తున్న శైలి మంచి పద్ధతి కాదని భారతదేశం లౌకిక సమయం వారి దేశం అన్ని మతాలు అన్ని కులాలు సమానత్వం గల భారతదేశంలో ఒక హిందుత్వాన్ని డిప్యూటీ సీఎం హోదాల్లో ఉండి సపోర్ట్ చేయడం తగదని ఆయన హెచ్చరించారు పద్ధతి మార్చుకుని పిఠాపురం ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టాలని పవన్ రాక ఒక మెరిపి తీగల వచ్చి వెళ్ళిపోయినట్లుగా ప్రజలు భావిస్తున్నారని ప్రజాసమస్యలు తెలియపరచడానికి అవకాశం కల్పించుకోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పెనుమళ్ళ గోపాల రెడ్డి డి ప్రసాద్ , సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# శభాష్ నితీష్ ఆటతీరు అద్భుతం

**-దేశానికి కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలి**
**-అభినందించిన ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు**
**ప్రజా వెలుగు దినపత్రిక జనవరి 10 వ విశాఖపట్నం**




మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో ఉత్తమ ఆటతీరు కనబరిచి అందరి దృష్టినీ ఆకర్షించిన విశాఖపట్నంకు చెందిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వైజాగ్‌కు వచ్చిన నితీశ్ కుమార్‌రెడ్డి విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ%–%వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్%–%ఇండియా టీ20 మ్యాచ్ సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా సెలెక్ట్ అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన ఆట తీరుతో భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో ఉత్తమ ప్రతిభతో విజయాలు నమోదు చేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలని ఆ దిశగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు, తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన మెల్‌బోర్న్ టెస్ట్ మ్యాచ్‌లో నితీశ్‌కుమార్‌రెడ్డి అద్భుతమైన బ్యాటింగ్‌తో సెంచరీ చేసి భారత్ జట్టును ఆదుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రామ ప్రశాంత్, కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణు తేజ్, ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎన్.కుమార్, అసిస్టెంట్‌జనరల్ మేనేజర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటయోధుడు పండుగ సాయన్న భూస్వాములకు రజాకారులకు వ్యతిరేకంగా పోరాటం మర్చిపోలేనిది నీలం మధు ముదిరాజ్

**-పోరాటయోధుడు పండగ సాయన్న..**
**-భూస్వాములకు రజాకర్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మర్చిపోలేనిది..**
**-ఆయన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం...**
**-సొంత నిధులతో పండగ సాయన్న విగ్రహం..**
**-రాయిని పల్లి లో విగ్రహావిష్కరణ కార్యక్రమం..**
**-భారీ బైక్ ర్యాలీ,మంగళ హారతులతో స్వాగతం పలికిన గ్రామస్థులు..**
**-భారీగా హాజరైన ప్రజలు..**
**-తెనుగోలా సాయన్న ను ఊరూరా ప్రతిష్టించి తెలంగాణ సాయన్నగా తీర్చిదిద్దుదాం..**
**-పాలమూరు యూనివర్సిటీకి పండగ సాయన్న పేరు పెట్టాలని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్తాం..**
**-నీలం మధు ముదిరాజ్**

నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పాన్ గల్ మండలం రాయిని పల్లి గ్రామంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహాన్ని ఆయన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్న కు పండగ సాయన్న పేరు వచ్చిందన్నారు. ఈ మహనీయుడు బంధుక్ ఎత్తి రజాకర్ల అన్యాయాలను ఎదిరించి ఎదురొడ్డి నిలిచి



బహుజనులకు అండగా నిలిచాడని గుర్తు చేశారు. అలాంటి మహావీరుడు స్ఫూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పండగ సాయన్న సేవలను భావితరాలకు తెలియజేయాలని సంకల్పంతో పండగ సాయన్న విగ్రహాలను ఊరూరా నెలకొల్పుతామని తెనుగోలా సాయన్న ను తెలంగాణ సాయన్నగా తీర్చిదిద్దుతాం అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు పాలమూరు యూనివర్సిటీ కి పండగ సాయన్న పేరు పెట్టేలా చూడాలని ఆయన దృష్టికి తీసుకుని రాగా అందుకు సానుకూలంగా స్పందించిన నీలం మధు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి అయ్యే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో డా,, పగిడాల శ్రీనివాసులు, బెక్కం జనార్దన్, పండగ సాయన్న వారసులు యాదయ్య,నర్సింలు, సభాధ్యక్షులు శివ ప్రసాద్, దర్గేష్,నాయకులు మమత గౌడ్, పెబ్బేటి మల్లికార్జున్, వెంకటస్వామి,వాకిటి ఆంజనేయులు, చెన్న రాములు, పుట్ట బలరాజు, మెట్టుకాడి శ్రీనివాస్,కృష్ణ, పండగ సాయన్న విగ్రహ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గమ్యం విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ గమ్యం విద్యాసంస్థల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో ముందుగా ముగ్గుల పోటీ నిర్వహించి విజేతల్ని ఎంపిక చేశారు . మధ్యాహ్నంగమ్యంలో గుమగుమలంటూ ఫుడ్ ఫెస్టివల్ సాయంత్రంగంగిరెద్దుల, హరిదాసు వేషధారణ, సరదా సరదాల కోడిపందాలు బోసి నవ్వుల చిన్నారులకు భోగి పళ్ళు, సంస్కృతి సాంప్రదాయాలకు తగినట్టు పంచికట్టు తెలుగుదనం ఉట్టిపడేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.అనంతరం భోగి మంటలు వేసి హరినామ సంకీర్తనతో సరదాగా చిందులు వేస్తూగమ్యం ఆట స్థలాన్ని విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు ఉపాధ్యాయులు చూడడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు గమ్యం విద్యాసంస్థల వల్ల ముందే వచ్చింది సంక్రాంతి అంటూ గమ్యం విద్యాసంస్థల్లోని చిన్నారులకు రేగిపళ్ళు చిల్లరి డబ్బులు పుష్పల రేకులతో ఆశీర్వదిస్తూభోగి పండుగను, గంగిరెద్దులు, కోడిపందాలు హరిదాసుసంకీర్తనతో సంక్రాంతి ,గమ్యం గుమగుమలతో కనుమ




పండుగను నిర్వహించుకున్నారు. మామిడాడ గమ్యం విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు చూసేందుకు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులే కాకుండా పరిసర మండలాలలోనిగ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గమ్యం విద్యాసంస్థల అధినేత కర్రి శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమను వెన్నంటి ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు .

# రాష్ట్ర ప్రజలందరి పై శ్రీ వారి ఆశీస్సులుండాలి....

**-నీలం మధు ముదిరాజ్...**
**-శ్రీ రంగాపురం రంగనాయక స్వామి వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న నీలం మధు..**
**-శ్రీ రంగసముద్రం రిజర్వాయర్,ఆలయ ప్రాంగణంలోని మ్యూజియం సందర్శన..**

ఏడుకొండల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ శాంతులతో వర్ధిల్లాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా శ్రీ రంగాపురం మండల కేంద్రంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారితో కలిసి ఉత్తర ద్వారం ద్వారా రంగ నాయక స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. నీలం మధు మాట్లాడుతూ విష్ణుమూర్తిని దర్శించుకోవడానికి వైకుంఠానికి తరలి వెళ్లిన ముక్కోటి దేవతలతో కలిసి స్వామి భూలోకానికి వచ్చే శుభ సందర్భాన్ని ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారన్నారు . వైకుంఠ ఏకాదశి పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారా దర్శనంతో స్వామివారిని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు తొలగిపోయి.. పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఆ దేవదేవుడు ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండి రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ రంగ




నాయక ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం చుట్టు ఉన్న రంగసముద్రం కొలను చూడముచ్చటగా ఉందన్నారు. దేవాలయ నిర్మాణలతో పాటు ఆలయాల అభివృద్ధికి సహకరించే విషయంలో తానెప్పుడూ ముందుంటానన్నారు. అనంతరం శ్రీ రంగ సముద్రం తో పాటు రిజర్వాయర్ ను, మ్యూజియం ను వారు సందర్శించారు. కార్యక్రమంలో డా,,పగిడాల శ్రీనివాస్, చొప్పరి వెంకటయ్య,నరేష్, పి వెంకటయ్య, ఎం రఘు ,ఆంజనేయులు ,మూర్తి,కృష్ణయ్య ,బిసన్న, కృష్ణ, ఈశ్వరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి జిల్లాలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఐపి ఎస్



నంద్యాల జిల్లాలో అర్ధరాత్రి వేళ నుండి నేటి ఉదయం తెల్లవారు జాము వరకు నంద్యాల టౌన్ మరియు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ వివిధ ప్రాంతాలలో వైకుంఠ ఏకాదశి, మరియు కొత్తసినిమాలు రిలీజ్ అవుతున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సందర్భంగా నంద్యాల పట్టణం గుడిపాడిగడ్డలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం మరియు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని అహోబిలం లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంను సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకున్నారు. నంద్యాల టౌన్ లో వివిధ సినిమా థియేటర్లలో కొత్త సినిమాలు రిలీజ్ అవుతున్న సందర్భంగా భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడుతూ బందోబస్తు విధులలో ఉన్న సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మరియు ఎప్పటికప్పుడు సమాచారం తనకు అందించాలని ఆదేశించారు.

# బిజినెస్



## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

బంగారం , వెండి కొనుగోలు చేయాలనుకుంటున్నారా? నూతన సంవత్సరంలో బంగారం రేట్లు కాస్త స్థిరంగానే కొనసాగుతున్నాయి. గురువారంతో పోల్చుకుంటే ఈ రోజు (డిసెంబర్ 11న) బంగారం ధరల్లో స్వల్పంగా పెరుగుదల నమోదైంది. ఈ నేపథ్యంలో నేడు (డిసెంబర్ 11న) ఉదయం 7.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 79, 630 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 72, 860గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 79, 630కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 73, 010కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79, 480కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 72, 680కి చేరింది. వెండి ధర మాత్రం పెరిగింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.



**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)**

- హైదరాబాద్‌లో రూ. 79, 480, రూ. 72, 860
- విజయవాడలో రూ. 79, 480, రూ. 72, 860
- ఢిల్లీలో రూ. 79, 630, రూ. 73, 010
- ముంబైలో రూ. 79, 480, రూ. 72, 860
- వడోదరలో రూ. 79, 530, రూ. 72, 910
- కోల్‌కతాలో రూ. 79, 480, రూ. 72, 860
- చెన్నైలో రూ. 79, 480, రూ. 72, 860
- బెంగళూరులో రూ. 79, 480, రూ. 72, 860
- కేరళలో రూ. 79, 480, రూ. 72, 860
- పుణెలో రూ. 79, 480, రూ. 72, 860

**ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)**

- హైదరాబాద్‌లో రూ. 1, 01, 100
- విజయవాడలో రూ. 1, 01, 100
- ఢిల్లీలో రూ. 93, 600
- చెన్నైలో రూ. 1, 01, 100
- కోల్‌కతాలో రూ. 93, 600
- కేరళలో రూ. 1, 01, 100
- ముంబైలో రూ. 93, 600
- బెంగళూరులో రూ. 93, 600
- వడోదరలో రూ. 93, 600
- అహ్మదాబాద్‌లో రూ. 93, 600

## ఈ ఏడాది రూ.14.27 లక్షల కోట్లు

**క్యాపిటల్ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణలో 21% వృద్ధి**

**సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్**



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ, డెట్ పథకాల ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుంచి కంపెనీల నిధుల సమీకరణ వార్షిక ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.14.27 లక్షల కోట్లకు చేరుకోవచ్చని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నిధుల సేకరణ రూ.11.8 లక్షల కోట్లుగా నమోదైంది. 2024-25లో గడిచిన 9 నెలల్లో (ఏప్రిల్-డిసెంబరు) కంపెనీలు ఈక్విటీ జారీ ద్వారా రూ.3.3 లక్షల కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.7.3 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.10.7 లక్షల కోట్ల వరకు సమీకరించాయని బుచ్ తెలిపారు. ఈ మూడు నెలల్లో (జనవరి-మార్చి) సేకరించనున్న నిధులతో కలిపితే మొత్తం విలువ రూ.14 లక్షల కోట్లు దాటవచ్చని ఎన్ఐఎస్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓ సదస్సులో ఆమె అంచనా వేశారు. మరిన్ని విషయాలు..

గడిచిన 9 నెలల్లో క్యాపిటల్ మార్కెట్ నుంచి సమీకరించిన మొత్తంలో రియల్ ఎస్టేట్ ఇన్వెస్టమెంట్స్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టమెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్), మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా పోగేసిన నిధుల వాటా చాలా స్వల్పంగా రూ.10,000 కోట్లకు పరిమితమైందని బుచ్ అన్నారు. కానీ, ఈ సాధనాల ద్వారా నిధుల సేకరణ వేగంగా పెరుగుతోందని.. వచ్చే దశాబ్ద కాలంలో ఈక్విటీ, డెట్ మార్కెట్లను మించిపోవచ్చన్నారు.

అనుమతుల జారీని వేగవంతం చేసే దిశగా సెబీ కృషి చేస్తున్నదని, ఎస్ఎంఈ బోర్డుల ప్రతిపాదనలకు అనుమతుల సమయాన్ని తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఎస్ఎంఈ ఇష్యూలకు అనుమతిచ్చేందుకు ప్రస్తుతం 3 నెలల వరకు సమయం పడుతోందన్నారు. కాగా, బ్యాంకులు కేవ లం 15 నిమిషాల్లో సూత్రపాయ అనుమతులిస్తున్నాయన్నారు.
చాలా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఆసక్తి చూపుతున్నాయని, సెబీకి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయన్నారు. కానీ, ప్రిఫరెన్షియల్ ఇష్యూలు, ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్, రైట్స్ ఇష్యూలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలూ ముఖ్యమేనని.. ఐపీఓల మోజులో వాటిని గమనించకపోయే ప్రమాదం ఉందన్నారు.

రైట్స్ ఇష్యూలకు వేగంగా అనుమతులిచ్చేందుకు నియంత్రణ మండలి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. మ్యూచువల్ ఫండ్ల కొత్త ఆఫర్లకు చాలా వేగంగా అనుమతులిస్తున్నామన్నారు.

కేవలం రూ.250తో క్రమానుగత పెట్టుబడి పథకాన్ని (సిప్) ప్రారంభించే వెసులుబాటును త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. గత కొన్నేళ్లలో మ్యూచువల్ ఫండ్లు వంటి దేశీయ సంస్థాగత ఇన్వెసర్లు (డీఐఐ) ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో నిధులు సమీకరిస్తుండటాన్ని బుచ్ ప్రశంసించారు. వీరి నుంచి సమీకరించిన నిధులతో డీఐఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం వల్లే మన మార్కెట్ ఒడుదుడుకులను తట్టుకోగలిగిందన్నారు.

## కాశ్మీర్ లోయలో మరో సొరంగం..

**-గేమ్ ఛేంజర్ కానున్న టన్నెల్ ప్రాజెక్ట్!**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జనవరి 13న జెడ్ మోడ్ టన్నెల్‌ను ప్రారంభించనున్నారు. 8,500 అడుగుల ఎత్తులో ఉన్న, 6.5 కి.మీ పొడవైన వ్యూహాత్మక సొరంగం శ్రీనగర్-లేహ్ హైవేపై నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను అన్ని సీజన్లలో సందర్శించదగిన ప్రదేశంగా మార్చడానికి మొదటి అడుగు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి నిరంతరాయంగా కనెక్టివిటీని అందిస్తుంది.
కాశ్మీర్ లోయలో చలికాలం కురిసే మంచు రవాణా వ్యవస్థను స్తంభింపజేస్తుంది. లోయను దాటి ఎటు వెళ్లాలన్నా ఎత్తైన హిమాలయ పర్వత శిఖరాలను దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఎత్తైన ప్రాంతాల్లో కొన్ని అడుగుల నుంచి మీటర్ల ఎత్తున కురిసే భారీ హిమపాతం రోడ్డు మార్గాలను పూర్తిగా మూసేస్తుంది. దీంతో కొన్ని నెలల పాటు ఆయా పర్వతాల మీదుగా సాగే ప్రయాణాలు నిలిచిపోతుంటాయి. పర్వత శ్రేణుల్లో నివసించే గ్రామాలు, పట్టణాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుంటాయి. ఈ పరిస్థితిని నివారించాలంటే పర్వతాలను అడ్డంగా తొలుస్తూ సొరంగాలను నిర్మించాల్సిందే..!
ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అదే పని చేస్తోంది. శ్రీనగర్‌ను రోడ్డు మార్గంలో నిరంతరం అనుసంధానించేందుకు అన్ని వైపులా టన్నెళ్లను నిర్మిస్తోంది. జమ్ము నుంచి శ్రీనగర్ చేరుకునే మార్గంలో చెనాని %-% నష్రి మధ్య నిర్మించిన డా. శ్యామప్రసాద్ ముఖర్జీ టన్నెల్, బనిహాల్ %-% ఖాజీగుండ్ రోడ్ టన్నెల్, జవహర్ టన్నెల్ పలు పర్వతాలను సునాయాసంగా దాటేలా చేస్తున్నాయి. చెనాని-నష్రి మధ్య టన్నెల్ నిర్మించకముందు పట్నిటాప్ మీదుగా సాగించే ప్రయాణానికి దూరాభారంతో పాటు చలికాలంలో హిమపాతం కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించే పరిస్థితులు ఉండేవి. కానీ ఇప్పుడు రోడ్డు మార్గంలో కొండచరియలు విరిగిపడితే తప్ప ఏ కాలంలోనైనా ప్రయాణం చేయడానికి వీలుంది. తాజాగా శ్రీనగర్‌కు బయటి ప్రపంచంతో రైలు మార్గం ద్వారా కనెక్టివిటీని కల్పించేందుకు చీనాబ్ నదిపై ఇంజనీరింగ్ అద్భుతంగా తీర్చిదిద్దిన 'చీనాబ్ రైల్ బ్రిడ్జి'తో పాటు ఏకంగా 55 టన్నెళ్లను భారత ప్రభుత్వం నిర్మించింది. అతి త్వరలో శ్రీనగర్‌కు నేరుగా రైల్వే కనెక్టివిటీని కల్పిస్తూ ఈ మార్గాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.



**శ్రీనగర్ %-% కార్గిల్ మార్గంలో జెడ్-మోర్హ్ టన్నెల్**

ఇదిలా ఉంటే%ొ% శ్రీనగర్‌ను మరోవైపు నుంచి లద్దాఖ్ ప్రాంతంలోని కార్గిల్, లేహ్ పట్టణాలతో అనుసంధానించే రోడ్డు మార్గంలోనూ పలు టన్నెళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. అందులో గండేర్‌బల్ జిల్లాలో నిర్మించిన జెడ్-మోర్హ్ (%గ్-మీ=ఽ%) టన్నెల్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ టన్నెల్ శ్రీనగర్ %-% సోనామార్గ్ మధ్య ప్రయాణదూరాన్ని తగ్గించడంతో పాటు హిమపాతం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి నిరంతరాయంగా కనెక్టివిటీని అందిస్తుంది. హిందూ తీర్థయాత్రల్లో అత్యంత క్లిష్టమైన 'అమర్‌నాథ్ యాత్ర'లో సోనామార్గ్ ఒక కీలక మజిలీ. బాల్తాల్ బేస్ క్యాంప్ చేరుకోవాలంటే సోనామార్గ్ పట్టణాన్ని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. పైగా అమర్‌నాథ్ యాత్రలో హెలికాప్టర్ ద్వారా వెళ్లేవారు సోనామార్గ్‌లోని హెలీప్యాడ్ నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఆధ్యాత్మికంగానే కాదు, పర్యాటకంగానూ సోనామార్గ్ కీలక ప్రాంతం. అనేక అడ్వెంచర్ టూర్స్, మంచుపై క్రీడలు ఇక్కడ జరుగుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తూ ఉంటారు.

ఆధ్యాత్మకం, పర్యాటకం కంటే కూడా భారత ప్రభుత్వానికి ఈ టన్నెల్ వ్యూహాత్మకంగా కీలకంగా మారనుంది. శ్రీనగర్ %-% లేహ్ మార్గంలో ఉన్న ద్రాస్, కార్గిల్ పట్టణాలకు చేరుకోవాలన్నా ఇదే మార్గం నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సముద్రమట్టానికి 3,528 మీటర్ల (11,578 అడుగుల) ఎత్తున ఉన్న జోజిలా పాస్ మీదుగా ప్రయాణం సాగించాలి. హిమపాతం కారణంగా నవంబర్ నుంచి మే నెల వరకు జోజిలా పాస్ ప్రయాణం చేయడానికి వీల్లేగుండా మూసుకుపోతుంది. గతంలో కార్గిల్ ప్రాంతంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా.. భారత్ ఏకంగా యుద్ధం చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతా బలగాలపై దాడులకు తెగబడ్డారు. ఒకవేళ కార్గిల్ ఉగ్రవాదుల హస్తగతమైతే.. శ్రీనగర్ %-% లేహ్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. అందుకే భారతదేశ రక్షణలో ఈ మార్గం కీలకం, వ్యూహాత్మకం. ఈ క్రమంలో శ్రీనగర్ %-% లేహ్ మార్గం (%చీఎ% 1)లో ప్రతికూల వాతావరణం, తీవ్ర హిమపాతం సమయంలోనూ రవాణా వ్యవస్థకు విఘాతం కలుగకుండా ఉండేందుకు పలు సొరంగాలను భారత సర్కారు నిర్మిస్తోంది. ఇవి రవాణా వ్యవస్థతో పాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకంగా మారనున్నాయి. జోజిలా పాస్ కంటే ముందుగా వచ్చే జెడ్-మోర్హ్ టన్నెల్ నిర్మాణం పూర్తిచేసుకోగా, 14.2 కి.మీ పొడవుతో జోజిలా టన్నెల్ వడివడిగా నిర్మాణం జరుపుకుంటోంది. ఏడాది పొడవునా శ్రీనగర్ %-% లేహ్ మధ్య రాకపోకలు సాగించడంలో జోజిలా టన్నెల్‌తో పాటు జెడ్-మోర్హ్ టన్నెల్ కీలకమైనవి.

**ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం**

మొత్తం 6.5 కి.మీ పొడవైన జెడ్-మోర్హ్ టన్నెల్‌ను జనవరి 13న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2,400 కోట్లు వెచ్చించింది. జమ్ము-కాశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో ద్రాస్, కార్గిల్ సెక్టార్లలో భద్రతా విధులు నిర్వహించే సైనికులకు సైతం ఈ టన్నెల్ కీలకంగా మారనుంది. ప్రధాని స్వయంగా టన్నెల్ ప్రాంతానికి చేరుకుని ప్రారంభించనున్నారు. ప్రధానితో పాటు ఈ కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హాజరుకానున్నారు. తొలుత ప్రధాని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని చర్చ జరిగింది. కానీ వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టును మోదీ భౌతికంగా అక్కడికి చేరుకుని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

## వ్యక్తిగత రుణాలకుస్థిర వడ్డీ రేట్లు తప్పనిసరి

RESERVE BANK OF INDIA

ముంబై: నెలవారీ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో చెల్లించే వ్యక్తిగత రుణాలను బ్యాంకులు తప్పనిసరిగా స్థిర వడ్డీ రేట్లకూ మంజూరు చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. దీనికి సంబం?ధించి శుక్రవారం తరచుగా అడిగే కొన్ని ప్రశ్నల (ఎఫ్ఏక్యూ)ను విడుదల చేసింది. అన్ని రకాల వ్యక్తిగత రుణాలకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ రుణాలు మంజూరు చేసేటప్పుడే వార్షిక వడ్డీ రేటును బ్యాంకులు తమ కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్), రుణ ఒప్పందంలో తెలియజేయాలని కోరింది. ఏ కారణం చేతనైనా రుణ చెల్లింపు సమయంలో ఈఎంఐ లేదా కాలపరిమితి మారితే ఆ విషయాన్ని కూడా బ్యాంకులు రుణ గ్రహీతలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ప్రతి మూడు నెలలకు జారీ చేసే స్టేట్‌మెంట్స్‌లోనూ బ్యాంకులు అప్పటి వరకు వసూలు చేసిన అసలు, వడ్డీ వివరాలు, ఈఎంఐ మొత్తం, ఇంకా ఎన్ని ఈఎంఐలు చెల్లించాలి? ఇంకా చెల్లించాల్సిన అసలుపై చెల్లించవలసిన వడ్డీ రేటు కూడా తెలియజేయాలని కోరింది. వడ్డీ రేట్లను సవరించేటప్పుడు బ్యాంకుల వ్యక్తిగత రుణ గ్రహీతలకు తమ బోర్డు ఆమోదించిన విధానానికి అనుగుణంగా స్థిర వడ్డీ రేటుకు మారే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# చక్కని ఆరోగ్యం

## అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు, రెట్టింపు అందం మీ సొంతం..!

అవిసె గింజలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని మనందరికీ తెలిసిందే. అందుకే ఇటీవలి కాలంలో వీటి వినియోగం బాగా పెరిగింది. అవిసె గింజలు ఆరోగ్యానికి కావాల్సిన మంచి పౌష్టిక విలువలను కలిగి ఉంటాయి. ఇవి చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మెరిసే చర్మం కోసం అవిసె గింజలతో ఫేస్ ప్యాక్ ప్రయత్నించండి. ఇది అనేక చర్మ సమస్యలను తగ్గిస్తుందని చెబుతున్నారు. ఫ్లాక్‌సీడ్స్ ఫేస్‌ప్యాక్‌తో చర్మం మెరిసిపోవడమే కాకుండా డార్క్ స్పాట్స్, పిగ్మెంటేషన్ తగ్గుతుంది. పూర్తి వివరాల్లోకి వెళితే..



అవిసె గింజలు ఆరోగ్యానికి కాదు అందానికి కూడా అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో ఒమేగా –3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్య, సౌందర్యానికీ సహాయపడతాయి. ఇవి చర్మానికి తగినంత తేమను అందించి చర్మాన్ని కోమలంగా మారుస్తాయి. చర్మకణాలలో పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. చర్మం పై మొటిమలు, మచ్చలు, ముడతలను తగ్గించి చర్మ నిగారింపును పెంచుతాయి.

కెమికల్ ఫేషియల్ చేసుకునే బదులు ఇంట్లోనే నేచురల్ అండ్ కెమికల్ ఫ్రీ ఫేషియల్ చేయించుకోవడం మంచిది. ఇందుకోసం ఒక చెంచా అవిసె గింజలను నీటిలో నానబెట్టి, ముఖంపై సున్నితంగా అప్లై చేసి 2-3 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి.. ఇది చర్మాన్ని లోతుగా శుభ్రపరుస్తుంది. ముఖంలోని మురికిని తొలగిస్తుంది.

అవిసె గింజల పొడిలో కొద్దిగా పెరుగు కలిపి స్క్రబ్‌లా తయారు చేసుకోవాలి. ఈ స్క్రబ్‌ను ముఖంపై సున్నితంగా అప్లై చేసి వృత్తాకారంలో మసాజ్ చేసుకోవాలి. దీని వాడకంతో డెడ్ స్కిన్ తొలగిపోయి చర్మం మృదువుగా కనిపిస్తుంది.

అవిసె గింజలతో మరో విధంగా కూడా అందాన్ని పెంచుకోవచ్చు.. ఇందుకోసం ఒక పాత్రలో వేడి నీటిని తీసుకుని అందులో అవిసె గింజలను వేయాలి. ఆ వేడినీటి నుండి వచ్చే ఆవిరిని ముఖానికి పట్టించాలి. ఇది చర్మ రంధ్రాలను తెరుచుకునేలా చేస్తుంది. చర్మాన్ని లోతుగా శుభ్రపరుస్తుంది.

ఫేస్ మాస్క్ కూడా తయారు చేసుకోవచ్చు..ఇందుకోసం ఫ్లాక్స్ సీడ్స్ జెల్‌లో తేనె, కొంచెం రోజ్ వాటర్ కలపాలి. దీన్ని ముఖానికి బాగా పట్టించి 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఈ మాస్క్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. ముఖానికి నేచురల్ గ్లో ఇస్తుంది.

ఫ్లాక్స్ సీడ్స్ ఫేషియల్ ముఖానికి మంచి టోనింగ్‌గా పనిచేస్తుంది. దీని కోసం ఫ్లాక్స్ సీడ్స్ నీటిని స్ప్రే బాటిల్‌లో నింపి ముఖంపై స్ప్రే చేయాలి. ఇది చర్మాన్ని చల్లబరుస్తుంది. తెరుచుకున్న రంధ్రాలను మూసివేస్తుంది. చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.


## ఒకే ఒక్క తమల పాకుతో ఎన్నో సమస్యలకు చెక్

మనకు ఈజీగా లభించే వాటిల్లో తమల పాకులు కూడా ఒకటి. తమల పాకులను సంప్రదాయానికి చిహ్నంగా వాడతారు. ఎలాంటి ఫంక్షన్స్, పెళ్లిళ్లు, పూజలకు తమల పాకులే ముందు ఉండాలి. కానీ తమల పాకులతో ఎన్నో అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడొచ్చు..

ఇంట్లో ఎలాంటి ఫంక్షన్స్ అయినా, పెళ్లిళ్లు అయినా, గుడికి వెళ్లినా, పూజలు చేసినా తమల పాకులు ఉండాల్సిందే. తమల పాకులు సంప్రదాయానికి పెట్టింది పేరు. తమల పాకు లేకుండా ఎలాంటి పేరంటం ఇవ్వరు. కనీసం ఒక ఆకు అయినా పేరంటంలో కలిపి ఇస్తారు.

కేవలం ఇది ఆకు అనుకుంటే మాత్రం పొరపాటే. ఈ ఆకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తమల పాకుతో ఎన్నో సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తమల పాకును పాక్ ఆకు అని పిలుస్తారు.

ఇంతకు ముందు పెళ్లిళ్లు, ఫంక్షన్స్‌లో పాన్ ఇచ్చేవారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతుంది. భోజనం చేసిన తర్వాత తమల పాకు నమిలి తింటే ఎంతో ఆరోగ్యమని పెద్దలు కూడా చెబుతూ ఉంటారు.




తమల పాకు తినడం వల్ల చర్మం, జుట్టు, మొత్తం శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో అనేక యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి.

నోటి ఆరోగ్యాన్ని, ఒత్తిడిని తగ్గించడంలో, జీర్ణ క్రియ మెరుగు పరచడంలో, చర్మ ఆరోగ్యం, జుట్టు ఆరోగ్యం, డయాబెటీస్ కంట్రోల్, గాయాలను నయం చేయడంలో ఇలా అనేక రకాలుగా తమల పాకు ఉపయోగ పడుతుంది

## ఈ పదార్థాన్ని తేనెతో కలిపి తీసుకుంటే ఇలాంటి సమస్యలన్నీ పరార్..!

**-శరీరంలో జరిగే అద్భుతాలు తెలిస్తే..**

చలికాలంలో తేనె, నల్లమిరియాలు తీసుకోవడం చాలా మంచిదని పోషకాహార నిపుణులు, ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.. ఇది అనేక ఆరోగ్య సమస్యలు నయం చేస్తుందని అంటున్నారు. ఆయుర్వేదంలో తేనె, నల్ల మిరియాలకు ఎంతో ప్రత్యేకత ఉందని చెబుతున్నారు.



నల్లమిరియాలను తేనెలో కలిపి నమలడం వల్ల అనేక వ్యాధులు నయమవుతాయని చెబుతున్నారు.. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధులను దూరం చేస్తుందని అంటున్నారు. మరిన్ని లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

జలుబు, దగ్గు, ఫ్లూతో బాధపడేవారికి నల్ల మిరియాలు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. ఆయుర్వేదం ప్రకారం..జలుబు, దగ్గు సమస్యలు ఉన్నవారు ఎండుమిరియాల పొడిని తేనెతో కలిపి తినాలి. ఈ సమస్యలను తొలగించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది.

ముక్కు, గొంతు సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు రాత్రి పడుకునే ముందు చిటికెడు మిరియాల పొడిని ఒక చెంచా తేనెలో కలిపి తీసుకోండి. మంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు.. డెంగ్యూ ప్రభావాలను తగ్గించడంలో కూడా ఇది మేలు చేస్తుంది. డెంగ్యూ జ్వరంతో బాధపడేవారు దీన్ని ఒక గ్లాసు నీటిలో కలుపుకుని తాగవచ్చు.

తేనె, నల్లమిరియాలు యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెరిగేలా చేస్తుంది. విటమిన్ కె, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు తేనెలో ఉంటాయి. నల్ల, తేనెలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది మధుమేహం, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇందుకోసం చిటికెడు నల్లమిరియాలు, తేనెతో కలిపి తిన్న తర్వాత అరగంటపాటు నీళు తాగకూడదు. దీంతో గొంతులో కఫం, నోటి దుర్వాసన, దగ్గు, ఛాతీ బిగుతు వంటి సమస్యలు నయమవుతాయి.

తేనెలో నల్ల మరియాలు, కొద్దిగా తులసి ఆకుల రసం కలిపి తీసుకుంటే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. శ్వాసనాళంలో వాపును తగ్గిస్తుంది. ఇది శ్వాసకోశాన్ని శుభ్రపరచడంలో కూడా సహాయపడుతుంది. బరువు పెరగడం అనే సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి తేనె మిరియాల పొడి మిశ్రమం బెస్ట్ రెమిడీగా పని చేస్తుంది.

## ఆలివ్ ఆకులతో ఆరోగ్యం

**-తీవ్ర వ్యాధులు మాయం**

**- రోజువారీ ఇలా వాడుకోండి**

ఇది అజీర్ణాన్ని నివారిస్తుంది. సాయంత్రం సమయాల్లో కూడా ఆలివ్ టీని తాగవచ్చు. ఈ టీ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరానికి గొప్ప విశ్రాంతిని ఇస్తుంది. దీన్ని తాగడం వల్ల రాత్రిపూట మంచి నిద్ర వస్తుంది. అలాగే, వ్యాయామం లేదా యోగా తర్వాత కూడా ఈ టీని తాగవచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కండరాల అలసటను తగ్గిస్తుంది.

ఆలివ్ ఆయిల్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే ఆలివ్ ఆకుల్లో కూడా ఆరోగ్యానికి మేలు చేసే గుణాలు, చాలా ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా. ఆలివ్ ఆకులతో తయారు చేసిన టీ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం మెరుగుపడుతుంది. ఆలివ్ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆలివ్ ఆకులతో తయారు చేసిన టీ తాగటం వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం..

యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆలివ్ ఆకులు.. రక్తపోటు, కొలెస్ట్రాల్ రెండింటినీ తగ్గించగలవు. ఆలివ్ ఆకు సారాన్ని తింటే ధమనుల్లో పూడికలు తగ్గిపోతాయి. పసుపుతో పాటు ఈ మొక్క ఆకులు కూడా ఎన్నో రకాల పోషకాలు నిండివున్నాయని చెబుతున్నారు.. వీటిలో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం, ధమనులతో పాటు శరీర కణాల్లో వాపును తగ్గించగలదు. పసుపు ఆకులను కూరల్లో వేసుకొని తింటే గుండె ఆరోగ్యం బాగుంటుంది.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఆలివ్ టీ తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఖాళీ కడుపుతో ఆలివ్ టీ తాగడం వల్ల శరీరం నిర్విషీకరణ చెందుతుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ప్రతి రోజూ ఉదయాన్నే



దీని టీ తాగడం వల్ల శరీరానికి శక్తి అందుతుంది. రోజంతా ఫ్రెష్ గా అనిపిస్తుంది.

భోజనం చేసిన 30 నిమిషాల తర్వాత కూడా ఈ టీ తాగవచ్చు. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంలో చాలా సహాయపడుతుంది. ఇది అజీర్ణాన్ని నివారిస్తుంది. సాయంత్రం సమయాల్లో కూడా ఆలివ్ టీని తాగవచ్చు. ఈ టీ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరానికి గొప్ప విశ్రాంతిని ఇస్తుంది. దీన్ని తాగడం వల్ల రాత్రిపూట మంచి నిద్ర వస్తుంది. అలాగే, వ్యాయామం లేదా యోగా తర్వాత కూడా ఈ టీని తాగవచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కండరాల అలసటను తగ్గిస్తుంది.

ఆలివ్ లీఫ్ టీ తయారీకి కావలసిన పదార్థాలు

%–% 5 పొడి లేదా తాజా ఆలివ్ ఆకులు

%–% 1 కప్పు నీరు

%–% నిమ్మకాయ

%–% రుచికి సరిపడా తేనెను తీసుకోవాలి.

ఆలివ్ లీఫ్ టీ ఎలా తయారు చేయాలి: ఆలివ్ లీఫ్ టీ చేయడానికి ముందుగా నీటిని మరిగించుకోవాలి. ఇప్పుడు అందులో ఆలివ్ ఆకులను వేసి సుమారు 10 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించాలి. ఇప్పుడు దానిని వడపోసి అందులో తేనె, నిమ్మరసం కలుపుకోవాలి. అంతే ఇప్పుడు వేడి వేడిగా ఆస్వాదిస్తూ తాగేయొచ్చు.


## మీకు నిద్ర బాగా పట్టాలా.. రాత్రి పూట అస్సలు తినొద్దు..

రాత్రి పూట నిద్ర అనేది ఆరోగ్యానికి చాలా ముఖ్యం. నిద్ర సరిగ్గా ఉంటేనే ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. శరీరానికి, మనసుకు కూడా రెస్ట్ అనేది కావాలి. ఇవి లేకుంటే.. అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. మంచి నిద్ర కావాలంటే ఈ ఆహారాలకు దూరంగా ఉండాలి..

ఉదయం లేచి ఎంత పని చేసినా రాత్రి పూట నిద్రపోతేనే ఒత్తిడి, అలసట, నీరసం వంటివి తగ్గుతాయి. అలా కాకుండా నిద్ర సరిగా పోకపోతే.. మాత్రం ఇబ్బందులు తప్పవు. చాలా మంది రాత్రి పూట తెలియకుండా చేసే కొన్ని తప్పుల కారణంగా నిద్ర సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తుంది.

కాబట్టి రాత్రి వేళలలో నిద్రించే ముందు కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది. మరి ఆ ఫుడ్స్ ఏంటో చూసేయండి. చాలా మంది రాత్రి పూజా పిజ్జా, బర్గర్లు వంటి ఆహారాన్ని తీసుకుంటారు. వీటి కారణంగా నిద్రపై ఎఫెక్ట్ పడుతుంది. ఎందుకంటే ఇవి అంత తేలిగ్గా అరగవు.

భోజనం చేసిన తర్వాత చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. స్వీట్లు, చాక్లెట్లు, క్యాండీస్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇవి కూడా డైటరీ ఫుడ్స్ కాబట్టి.. జీర్ణం కావు. అంతే కాకుండా



దగ్గు వంటివి వస్తాయి. నిద్రపోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. రాత్రి నిద్రపోయే ముందు కెఫీన్, ఫ్యాటీ ఐటెమ్స్, కోకోవా వంటి ఆహారాలు తిన్నా కూడా నిద్ర సమస్యలు రావచ్చు. వీటి వలన అసిడిటీ సమస్య రావచ్చు. మద్యం, కార్బోనేటెడ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌కి కూడా దూరంగా ఉండాలి.

అలాగే వాటర్, మజ్జిగ వంటివి కూడా తక్కువగా తీసుకోవాలి. దీని కారణంగా వాష్ రూమ్‌కి ఎక్కువగా వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట కేవలం తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. డిన్నర్ వీలైనంత త్వరగా కంప్లీట్ చేస్తేనే ఆరోగ్యానికి మంచిది.

## ఉదయాన్నే ఖాళీ కడుపుతో యాలకుల వాటర్ తాగితే దిమ్మతిరిగే అద్భుతాలు..!

ఇటీవలి కాలంలో చాలా మంది డీటాక్స్ వాటర్‌ను అలవాటుగా చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా కీరదోస, మెంతుల నీరు, జిలకర్ర, సోంపు వాటర్ ఇలాంటివి ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే, యాలకుల వాటర్ కూడా మంచి డీటాక్స్ డ్రింక్‌గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్ని ప్రయోజనాలు కలుగుతాయో ఓసారి చూద్దాం..

యాలకులు..ప్రతి వంటింట్లోను తప్పక ఉండే ఒక ముఖ్యమైన మసాలా దినుసు..దీని ఉపయోగాలు ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. సాధారణంగా మనం యాలకులను ఆయా వంటకాలకు మంచి ఫ్లేవర్ కోసం.. సువాసన కోసం వినియోగిస్తుంటాం. అయితే, ఈ యాలకులు మన ఆరోగ్యానికి కూడా దివ్యౌషధంగా పనిచేస్తుంది.

రెండు పచ్చి ఏలకులను నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల శరీరం, మనస్సు ప్రశాంతంగా ఉంటాయి. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. ఉదయం కాఫీ లేదా టీకి బదులుగా ఖాళీ కడుపుతో ఏలకుల నీటిని తాగడం వల్ల జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, గుండెల్లో మంట, అజీర్ణం నివారిస్తుంది.

పచ్చి ఏలకుల నీటిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. ఇవి నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. ఇది బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటిని రిఫ్రెష్ చేస్తుంది. అంతేకాదు..ఉదయం ఖాళీ కడుపుతో ఏలకుల నీటిని తాగడం వల్ల శరీరం నుండి టాక్సిన్స్, అదనపు నీటిని బయటకు పంపి, శరీరాన్ని శుభ్రపరచడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

యాలకులలోని గుణాలు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. ఇది మూత్రపిండాలు, కాలేయాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది.

మీరు బరువు తగ్గాలంటే ఉదయాన్నే ఖాళీ కడుపుతో యాలకుల నీరు తాగడం మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును కాల్చడంలో సహాయపడుతుంది. ఈ నీటిని తాగడం వల్ల శరీరంలోని మెటబాలిజం మెరుగై, అదనపు క్యాలరీలను కరిగించి, త్వరగా శరీర బరువులో మంచి మార్పు వస్తుంది.

ఆకుపచ్చ యాలకులు ఫైబర్, ఇనుము, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, అనేక యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇది శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.